ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 11, సెప్టెంబరు 2025

పీహెచ్‌సీల తనిఖీ

కలెక్టర్ ఆదేశాలతో మండలాలకు తరలిన ప్రత్యేక అధికారులు

రికార్డుల పరిశీలన, రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా
ముండ్లమూరు పీహెచ్‌సీని పరిశీలించిన కలెక్టర్ అన్సారియా



ముండ్లమూరు పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న వైద్యసేవలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టి సారించారు. ఆమె ఆదేశాలతో మండల ప్రత్యేకాధికారులు రంగంలోకి దిగారు. బుధవారం జిల్లాలోని 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. స్వయంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ముండ్లమూరులోని పీహెచ్‌సీని తనిఖీ చేయడంతోపాటు అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారించింది. పీహెచ్‌సీలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతోపాటు మందులను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు వైద్య సేవలపై ఇటీవల ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలను తెలుసుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యసేవల పట్ల వారిలో అసంతృప్తి ఉన్నట్లు వెల్లడైంది. ఇతర జిల్లాలతో పోల్చితే మన జిల్లాలో ఐవీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వైద్యసేవలపై ఎక్కువ వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ విషయంపై కలెక్టర్ తమీమ్ అన్సారియాతో ఉన్నతాధికారులు మాట్లాడినట్లు సమాచారం. దీంతో ఆమె అన్ని పీహెచ్‌సీలను తనిఖీ చేసి సమగ్ర నివేదికలను అందజేయాలని మండల ప్రత్యేకాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో పీహెచ్‌సీలను పరిశీలించిన వారు ఆ సమయంలోనే వైద్యసేవలకు వచ్చిన ప్రజలు, రోగుల నుంచి వివరాలను సేకరించినట్లు తెలిసింది.

రికవరీ

ఎస్సీ కార్పొరేషన్‌కు బకాయిల గుదిబండ

- మొండివి రూ.24.18 కోట్లు
- వసూలైతేనే కొత్త వారికి రుణాలు
- బకాయిదారులకు నోటీసులు
- అధికారులకు తలనొప్పిగా వ్యవహారం





ఎస్సీ కార్పొరేషన్‌కు బకాయిలు గుదిబండలా మారాయి. గతంలో స్వయం ఉపాధి పథకాలు, ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తిరిగి వాటిని చెల్లించకపోవడంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించాల్సిన గడువు ముగిసినా ఏమాత్రం స్పందించడం లేదు. దీంతో కార్పొరేషన్‌కు వసూలు కావాల్సిన మొత్తం రూ.24.18 కోట్లుగా తేలింది. వాటిని రాబట్టడం ఆ శాఖ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా లబ్ధిదారులు లెక్కచేయని పరిస్థితి నెలకొంది. అవి వసూలైతేనే కొత్తవారికి రుణాలు ఇచ్చే పరిస్థితి. దీంతో అంతా గందరగోళంగా తయారైంది.

ఒంగోలు నగరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌కు సరికొత్త సమస్య వచ్చిపడింది. రుణాలు తీసుకున్న వారు సకాలంలో వాటిని తిరిగి చెల్లించకపోవడంతో అవి కొండలా పేరుకుపోయాయి. బకాయిల వసూలుకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. రుణాలు తీసుకున్న వారి ఇళ్ల చుట్టూ తిరుగుతున్నా పెద్దగా స్పందించడం లేదు. దీంతో వారికి తాజాగా వారం క్రితం మళ్లీ నోటీసులు పంపించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద 608 మందికి వివిధ యూనిట్ల ఏర్పాటుకు ఇచ్చిన రూ.18.92 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద 225 మందికి రుణాలు అందజేయగా రూ.5.26 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇలా మొత్తం 833 మంది తీసుకున్న రుణాల్లో రూ.24.18 కోట్లు రావాల్సి ఉంది.

ఆరేళ్లుగా ఒట్టిపోయిన కార్పొరేషన్

గతంలో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో కళకళలాడిపోయేది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో కార్పొరేషన్ ద్వారా విలువైన యూనిట్లను భారీగా లబ్ధిదారులకు అందజేశారు. స్వయం ఉపాధి యూనిట్లతోపాటు ఇన్నోవా, ఇతియోస్ కార్లు, పెద్దపెద్ద వాహనాలు, ట్రాక్టర్లు అందజేశారు. అయితే ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో

తొలివిడత విచారణ తూచ్

- రెండు రోజుల షెడ్యూల్‌లో రెండు గంటలు కూడా సాగని వైనం
- నీరుగారనున్న డీసీసీబీలో సెక్షన్ 51 విచారణ



బ్యాంకు నుంచి బయటకు వస్తున్న విచారణాధికారి గౌరీశంకర్

ఒంగోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం విధించిన సెక్షన్ 51 విచారణ నీరుగారే పరిస్థితి కనిపిస్తోంది. అందుకు విచారణాధికారిగా నియమితులైన సహకార శాఖ అదనపు కమిషనర్ గౌరీశంకర్ తొలివిడతగా మంగళ, బుధవారాల్లో చేపట్టిన విచారణే నిదర్శనం. రెండు రోజుల ఆయన షెడ్యూల్‌లో కనీసం రెండు గంటలు కూడా బ్యాంకులో విచారణ చేపట్టలేదు. రెండో రోజైన బుధవారం ఉదయం ఒంగోలు రూరల్ మండలం కరవది పీఏసీఎస్‌లో ఎరువులను పరిశీలించిన గౌరీశంకర్... అనంతరం డీసీవో ఇందిరాదేవితో కలిసి పీడీసీసీ బ్యాంకుకు వెళ్లారు. సహకారశాఖ అధికారులకు తన షెడ్యూల్‌ను ఇచ్చే సమయంలోనే బ్యాంకు అధికారులకు కూడా విచారణాధికారి అవసరమైన రికార్డులు అందుబాటులో ఉంచాలని నోటీసు ఇవ్వాలి. అయితే ప్రస్తుత విచారణాధికారి అలాంటి నోటీసు కూడా బ్యాంకు అధికారులకు ముందుగా పంపలేదని సమాచారం. అంతేకాక విచారణలో

మిగతా 6వ పేజీలో



సభా ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు అనగాని, పయ్యావులతో ఉమ్మడి జిల్లామంత్రులు, ఎమ్మెల్యేల సెల్ఫీ

అనంతపురం సభలో సందడి


- హాజరైన ఉమ్మడి జిల్లా కీలక నేతలు
- సూపర్ హిట్ సభ సక్సెస్

ఒంగోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ బుధవారం అనంతపురంలో నిర్వహించిన సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆపార్టీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు అంతా పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో పలువురు సందడిగా గడిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను 15 నెలల కాలంలోనే అమలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో కూటమి ప్రభుత్వం అనంతపురంలో భారీ బహిరంగ సభను నిర్వహించింది. రాయలసీమ ప్రాంతం నుంచి లక్షలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలతో సభ విజయవంతమైంది. కాగా సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పాటు కూటమిలోని మూడు పార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు. కాగా అధిష్ఠానం ఆదేశాలతో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్‌స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఇతర ముఖ్యనేతలు ఆ సభకు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు నాలుగు రోజుల ముందుగానే వెళ్లి అక్కడ సభా ఏర్పాట్లు, జన సమీకరణ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. మిగతావారు బుధవారం జరిగిన సభకు హాజరయ్యారు. ముందు కొందరు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఆ ప్రాంగణంలో తిరిగి ఇతర మంత్రులు, నాయకులతో కలిసి సందడి చేశారు.

కనిగిరిలో సూపర్ హిట్ సంబరాలు..!

సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సంబరాలు కనిగిరిలో టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక అమరావతి ప్రాంగణంలో తెలుగు మహిళలు వినూత్నంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల రంగుల ముగ్గులతో ప్రాంగణంలో 6 అంకెను వేసి బాబు సూపర్ అంటూ తీర్చిదిద్దిన లోగో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాల్గొన్న తెలుగు మహిళలు కరణం అరుణ, షేక్ వాజిదా బేగంలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా నెరవేర్చారన్నారు. వాటిల్లో ప్రధానంగా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం ద్వారా బిడ్డల చదువులకు నగదు జమ, అన్నదాత సుఖీభవ ఉన్నాయన్నారు. చంద్రబాబు అడుగు జాడల్లోనే కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడంతోపాటు ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి చేసి చూపించారన్నారు. ప్రాంగణంలో మహిళలు, టీడీపీ నేతలు పెద్దఎత్తున పాల్గొని సూపర్‌సిక్స్ పథకాల వివరాలను తెలియచేస్తూ, ప్లకార్డులను ప్రదర్శిస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు తులసి, స్వప్న, దొరసాని, ధనలక్ష్మి, నారాయణమ్మ, నీరజ, లక్ష్మీ, పార్వతి పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి, కనిగిరి



సూపర్‌సిక్స్ లోగో చుట్టూ సంబరాలు చేస్తున్న తెలుగు మహిళలు

మోదేపల్లి మేజర్‌కు నిలిచిన నీటి సరఫరా : 7లో



పల్లామల్లి సొసైటీ భవనం

రూ.51.91 లక్షలు గోల్‌మాల్!

- పల్లామల్లి సొసైటీలో సీఈవో, గుమస్తా దోచేశారు
- బ్యాంకు ఖాతాలో జమచేయకుండా స్వాహా
- సంఘ అధ్యక్షుడు కూడా బాధ్యుడే

ఒంగోలు విద్య, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో భారీగా అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయి. సొసైటీకి రైతులు చెల్లించిన స్వల్ప, దీర్ఘకాలిక రుణ బకాయిలు రూ.51.91 లక్షలు గోల్‌మాల్ అయ్యాయి. 166 మంది రైతుల రుణ బకాయిలు వాయిదా మీరినా వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సొసైటీలోని కొంతమంది రైతులకు రుణపరిమితికి మించి అదనంగా ఇచ్చారు. సీఈవో జి.రమణయ్య, గుమస్తా షేక్ ఇమామ్‌లు 34మంది రైతుల నుంచి వసూలు చేసిన రూ.51.91లక్షలు స్వాహా చేశారు. ప్రతిరోజూ లావాదేవీలు ముగిసిన తర్వాత సొసైటీ అధ్యక్షుడు చివరలో సంతకం చేయాలి. అయితే అప్పటి సొసైటీ అధ్యక్షుడు నగదు పుస్తకంలో సంతకాలు చేశారు కానీ జరిగిన మోసాన్ని గుర్తించలేకపోయారు. సొసైటీ రసీదు పుస్తకాలను కూడా పరిశీలించకపోవడంతో ఈ అక్రమాల పర్వం కొనసాగింది. గల్లంతైన రూ.51.91 లక్షలకు సొసైటీ అధ్యక్షుడు, సీఈవో, గుమస్తాలను బాధ్యులుగా గుర్తించారు. సొసైటీలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ఒంగోలు డివిజనల్ సహకారాధికారి డి.శ్రీనివాసరావును వివరణ కోరగా సొసైటీపై విచారణ నివేదిక అందిందన్నారు. గుమస్తా షేక్ ఇమామ్ ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్నారని తెలిపారు. సీఈవోపై క్రమశిక్షణ చర్యలకు సొసైటీ కొత్త పాలక వర్గానికి డైరెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఆదాయం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి

- సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు
- కనిగిరి డిపో సందర్శన

7

గ్రామాలకు స్వచ్ఛ చేయూత

- భూగర్భ జలాల పెంపునకు కార్యాచరణ
- 40 గ్రామాల్లో రూ.5 కోట్లతో పనులు
- టాటా ట్రస్ట్ సహకారంతో విజయ వాహినీ ఫౌండేషన్ శ్రీకారం

త్రిపురాంతకం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు స్వచ్ఛ జలాలు అందాలన్న లక్ష్యం.. అడుగంటిపోతున్న భూగర్భ జలాల వృద్ధి ద్వారా భవిష్యత్‌లో నీటి సమస్యకు చెక్ పెట్టాలన్న సంకల్పం.. ఇటువంటి ఆశయాలకు ప్రభుత్వ తోడ్పాటుతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తోడైతే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. అందుకు ప్రస్తుతం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో జరుగుతున్న పనులు నిదర్శనం. ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఎన్నో ఏళ్లుగా నీటి సమస్యతో సతమతమవుతోంది. పలు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం నీటి వనరుల పెంపునకు కృషిచేస్తోంది. ఇప్పుడు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఇటువంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు చేయూతను అందిస్తున్నాయి. అందులోభాగంగా ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని 40 గ్రామాల్లో దాదాపు రూ.5 కోట్ల ఖర్చుతో భూగర్భ జలాల పెంపునకు అవసరమైన పనులు ప్రారంభమయ్యాయి. టాటా ట్రస్ట్ సహకారంతో విజయవాడకు చెందిన విజయ వాహినీ ఫౌండేషన్ పనులను కూడా చేపట్టింది.

పంచాయతీల భాగస్వామ్యం

గ్రామాల్లో భూగర్భ జలాలు పెంపునకు తీసుకోవాల్సిన చర్యలకు గ్రామస్థాయిలోనే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. స్థానిక పంచాయతీ తీర్మానాలు తీసుకుంటూ వారిని కూడా ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. చెక్‌డ్యాలు, , పెర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం, సేద్యపు నీటి కుంటలు, చెరువులు, కుంటల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దాదాపు రూ.5కోట్లతో చేపట్టే ఈ పనుల్లో 20 శాతం ప్రభుత్వం లేదా స్థానిక ప్రజల నుంచి నిధులు రాబట్టేలా ప్రణాళిక తయారు చేశారు. ఇప్పటికే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం గతంలో ఆయా గ్రామాల్లో చేసిన పనుల్లో చెక్‌డ్యాంల పునరుద్ధరణ, చెరువుల్లో పూడికతీతలు, కొద్దిపాటి మరమ్మతులను పూర్తి చేశారు. త్వరలోనే ఎంపిక చేసిన గ్రామాల్లో సమగ్ర నీటి సంరక్షణ పనులు చేపడతామని కార్యనిర్వాహకులు చెప్తున్నారు.



చెక్‌డ్యాం నిర్మాణ పనుల్లో కూలీలు



డీఎంహెచ్‌వో కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న ప్రపంచ బ్యాంకు బృందం

ఒకేరోజు జిల్లాకు రెండు బృందాలు

- కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలును పరిశీలించేందుకొచ్చిన సెంట్రల్ టీం
- పీహెచ్‌సీల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

7



ఉల్లిపాయల నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఉల్లి నాణ్యతను పరిశీలించిన జేసీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ఒంగోలులోని రైతు బజార్లకు సరఫరా చేసిన ఉల్లిపాయల నాణ్యతను జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పరిశీలించారు. బుధవారం ఒంగోలులోని మూడు రైతు బజార్లను జేసీ సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వేన్షన్ పథకం కింద రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు అందించేందుకు కర్నూలు జిల్లా నుంచివచ్చిన ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. రైతులు, వినియోగదారుల నుంచి కూరగాయాల ధరలను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్లలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతు బజార్ల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ వరలక్ష్మి, డీఈఈ పవన్‌కుమార్, రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు ఉన్నారు.

ఉపరాష్ట్రపతిని సత్కరించిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత 15వ ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌ను ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధ వారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఉపరాష్ట్రపతిని ఎంపీ మాగుంట శాలువ కప్పి సత్కరించారు. అనంతరం పలు అంశాలపై ఆయనతో చర్చించారు.



ఉపరాష్ట్రపతిని సన్మానిస్తున్న ఎంపీ మాగుంట



మన్నం ప్రసాద్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న రాష్ట్రప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు మన్నం ప్రసాద్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని విప్లవ రచయితల సంఘం నేత సీఎస్ఆర్. ప్రసాద్ అన్నారు. కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో మన్నం ప్రసాద్ సంస్మరణ సభ బుధవారం ఒంగోలులోని సీపీఐ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు వెంకట్రావు అధ్యక్షత వహించగా, సీఎస్ఆర్ ప్రసాద్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. నయీం హంతక ముఠా చేతిలో మరణించిన ప్రసాద్ కేఎన్‌పీఎస్‌లో కొనసాగిన ప్రస్థానం మరువలేనిదన్నారు.సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్ర శేఖర్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. కొండారెడ్డి, ప్రజా కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. కోటి, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే. కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బుధవారం బీజేపీ నాయకులు ప్రకాశం భవన్ దగ్గర గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఎంతో మందికి ఆర్థిక పరమైన వెసులు బాటు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీజిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు,నాయకులు మకుటం శివ, రవిశంకర్. అమర్ సింహ, అశోక్‌రెడ్డి, జేవీ నారాయణ, దండు శ్రీనివాసరావు, సతీష్, సాయి, దామోదర్, ఆషారావు, బెల్లంకొండ విజయలక్ష్మి, రావులపల్లి నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజశేఖర్

నానో యూరియా ప్రయోజనకరం

- మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్

చీమకుర్తి,సెప్టెంబర్10: రైతులు నానో యూరియా వాడక వలన కలిగే ప్రయోజనాలను గ్రహించి ఉపయోగించాలని మండల ప్రత్యేకఅధికారి, మైన్స్ డీడీ రాజశేఖర్ కోరారు. బుధ వారం చీమకుర్తిలో ఎరువుల లభ్యత,వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజశేఖర్ మాట్లాడుతూ రైతుకు సరిపడా ఎరువుల లభ్యత ఉందని,ఎటువంటి ఆందోళన వద్దని తెలిపారు. అలాగే నల్లబర్లీ సాగు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య,ఏఓ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

ప్రత్యేకాధికారి రవి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని మండల ప్రత్యేకాధికారి బి.రవి సూచించారు.చేకూరపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుధ్య పనులను ప్రత్యేకాధికారి బి.రవి బుధవారం పరిశీలించారు.రోజూ పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని కాలనీ వాసులను అడిగి తెలుసుకొన్నారు. నివాస గృహాలలోని వాడుకనీరు నిలిచిపోయి దోమల వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతాయని, అందువల్ల ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. పంచాయితీ సిబ్బంది రోజూ చెత్త సేకరణ చేయాలని, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నూతనంగా మంజూరైన చెత్త సేకరణ వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తేళ్ల రవికుమార్, సర్పంచ్ కొమ్మినేని రమేష్ బాబు, కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



చేకూరపాడులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రవి

యూరియా వాడకంపై రైతులకు అవగాహన

స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మండలంలోని అభ్యుదయ రైతులు, రైతు సంఘం నాయకులతో వ్యవసాయాధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూరియా వాడకం,లభ్యతపై మండల ప్రత్యేకాధికారి బి.రవి బుధవారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. అలాగే నానో ఎరువుల వాడకం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఎరువులపై రైతులు ఎలాంటి ఆందోళన చెందరాదని తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ

అమ్మనబ్రోలు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలను ప్రత్యేకాధికారి బి.రవి తనిఖీ చేశారు.ల్యాబ్, ఓపీ రిజిస్టర్, మందుల గది,అందుబాటులో ఉన్న మందులు వాటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యశాలలో ఇద్దరు వైద్యులు, ఫార్మసిస్ట్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.వైద్యులు లేని వైద్యశాల ఏంటని ప్రశ్నించారు. వైద్యశాలలో ఉపయోగించిన సిరంజీ, దూది తదితర వ్యర్థాలను తొలగించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఇంకుడు గంతల నిర్మాణాలకు టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఉప్పుగుండూరు, ముప్పాళ్ల, తిమ్మసముద్రం గ్రామాలలో పర్యటించి ఇంకుడు గుంతల నిర్మాణ ఆవశ్యకతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఆయన వెంట ఎంపీడీవో రవికుమార్, మండల తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, ఏపీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని, పంటపొలాలను చౌడు భూములుగా మారకుండా ప్రతి రైతు బాధ్యత తీసువాలని ఒంగోలు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని రైతులతో, మండలస్థాయి అధికారులతో బుధవారం రసాయనిక ఎరువులు వాడకంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట ఎరువుకు జీలుగ,జనుము లాంటి పంటను సాగు చేసి 40 రోజులు తరువాత దుక్కిలో దున్నేయటంతో పంట పొలాలకు కావాల్సినంత ఎరువు లభిస్తుందన్నారు. అలాగే నానో యూరియా లిక్విడ్ రూపంలో వచ్చిందని, అధికారులు సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే నానో యూరియాను పిచికారీ చేయాలని అన్నారు. అదే విధంగా ఎరువులు అధిక ధరలకు అమ్మటం, బ్లాక్ మార్కెట్ చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అలాగే గ్రామాలలో ప్రతిరైతు మొక్కలు పెంచి పర్యావరణంను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె .రాజశేఖరరావు, తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఏడీఏ బి.రమేష్ బాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె .రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, మండలంలోని వివిధ గ్రామాలరైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంగోలు మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు



మద్దిపూడిలో యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సేంద్రియ ఎరువుల వినియోగం లాభదాయకం

మద్దిపూడి : సేంద్రియ ఎరువుల వినియోగం రైతులకు లాభదాయకమని మండల ప్రత్యేక అధికారి, డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. బుధవారం మద్దిపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల భూమి భౌతిక లక్షణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు. మండలంలో యూరియా కొరత లేదని ఆమె స్పష్టం చేశారు. ఏవో వెంకటేష్ మాట్లాడుతూ నానో ఎరువులపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగూర్‌వలి, ఏఈవో కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు చిరంజీవి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులను సరఫరా చేయాలని కొండపి నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి డీలర్లకు సూచించారు. బుధవారం ఆయన డీలర్లతో మాట్లాడారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ నిర్మలకుమారి, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, వ్యవసాయ అధికారి ఎం.మాల్యాద్రి, రైతులు పాల్గొన్నారు.

సింగరబొట్లపాలెం, చౌటపాలెంలలో..

పొన్నలూరు : మండలంలోని సింగరబొట్లపాలెం, చౌటపాలెం గ్రామాలలో బుధవారం వ్యవసాయ అధికారి వడ్డే రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు యూరియా, రసాయన ఎరువులను అవసరానికి మించి వాడకూడదన్నారు. ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీ వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి రాము మాట్లాడుతూ మండలంలో 27 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదన్నారు. కార్యక్రమంలో తసీల్దార్ వి.పుల్లారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, రైతులు పాల్గొన్నారు.



పిచ్చితీగతో అల్లుకున్న స్తంభం



తొలగించిన అనంతరం ఇలా..



పిచ్చిమొక్కలతో నిన్న ఇలా..



తొలగించిన అనంతరం

'స్తంభం ఎక్కిన నిర్లక్ష్యం' కథనానికి స్పందన

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతనూతలపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమమైన స్తంభం ఎక్కిన నిర్లక్ష్యం అనే కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సంతనూతలపాడు, మైనంపాడు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కలు అల్లుకుని అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతూ ప్రమాదభరితంగా మారింది. ఈకథనంపై బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి స్తంభాలకు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు మండల విద్యుత్ ఏఈతెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు వల్ల రోడ్డున పడిన ఆటో కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతనం కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లాప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం గత నెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలు ఎక్కేందుకు ముందుకు రాకపోవడంతో వారు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మందికి పైగా కార్మికులు ఉన్నారన్నారు. వారందరిని ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తంబి శ్రీనివాసులు, మహ్మద్ బేగ్, హుస్సేన్, ఏ కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, సురేష్ టి. మహేష్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా సమితి అధ్యక్షుడు హనుమారెడ్డి

మోదీ చర్యలను ప్రతిఘటించాలి

- రైతు సంఘం జిల్లాసమితి సమావేశం డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని పత్తి రైతులకు నష్టం వాటిల్లే ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లాసమితిసమావేశానికి బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వడ్డె హనుమారెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాల వల్ల రైతులు తీవ్ర నష్టాలపాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డి. శ్రీనివాస్, బి.రామయ్య, డి. పుల్లయ్య, టీవీ శేషయ్య, సీహెచ్.వాసు, జి. ప్రసాద్, లెనిన్, ప్రభాకర్, వెంకట్రావు, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఒంగోలు రిమ్స్ ప్రముఖ సైక్రియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ బృందం ఏడుకొండలు, అనిల్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్‌లు సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఇజ్రాయిల్ మంత్రి పర్యటనను వ్యతిరేకించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :పాలస్తీనా, గాజాదేశాలను ధ్వంసం చేస్తూ అక్కడ ప్రాణ, ఆస్తినష్టాలను కలిగిస్తూ 20వేల మంది చిన్నారుల మరణాలకు కారణమైన ఇజ్రాయిల్ మంత్రి భారత్ పర్యటను వ్యతిరేకించాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని పలు ప్రభుత్వ కార్యాలయాలను మండల స్పెషల్ ఆఫీసర్ పి.శ్రీహరి బుధవారం తనిఖీచేశారు. పీహెచ్‌సీ, జడ్పీహైస్కూల్‌లను పరిశీలించారు. చంద్రపాలెంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సోక్ పిట్ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు.

పొన్నలూరులో భారీ వర్షం

పొన్నలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ మండింది. ఆతర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటుచేసుకుంది. ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం 4 గంటల నుంచి వర్షం ప్రారంభమైంది. గంటసేపు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నూకసానికి యాదవ సంఘ నేతల సత్కారం

సంతనూతలపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం సంతనూతలపాడుకు చెందిన యాదవసంఘం నేతలు విజయవాడలో నూకసాని బాలాజీని గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడుకు చెందిన యాదవసంఘం నేతలు పాల్గొన్నారు.

తొలి విడత విచారణ తూచ్

(5వ పేజీ తరువాయి)

ఆయనకు సహాయకులుగా ఎన్టీఆర్ జిల్లాలోని ఒక డీఎల్‌సీవోను, గుంటూరులోని ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వగా వారిని కూడా తన వెంట తీసుకొని రాలేదని తెలిసింది. మొత్తం మీద రెండు రోజుల షెడ్యూల్‌లో బుధవారం మధ్యాహ్నం పీడీసీసీ బ్యాంకుకు వెళ్లి కొద్దిసేపు మాత్రమే ఉన్న ఆయన అప్పుడు బ్యాంకు అధికారులకు నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం డీసీవో కార్యాలయానికి వెళ్లి సాయంత్రం తిరిగి గుంటూరు వెళ్లిపోయారు. ఇదేసమయంలో పీడీసీసీ బ్యాంకుపై సెక్షన్ 51 విచారణకు స్థానికంగా కీలకంగా ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యే సానుకూలంగా లేడన్న సంకేతాలు బ్యాంకు పరిస్థితిని బట్టి కనిపిస్తున్నాయని, అలా అయితే విచారణ కొనసాగించడం అవసరం లేదన్న రీతిలో ఆయన కొందరితో మాట్లాడినట్లు సహకార శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. మొత్తం మీద గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున బ్యాంకులో అక్రమాలు జరిగాయని సీఎంకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫిర్యాదు చేయడం, మంత్రి డాక్టర్ స్వామి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడిన ఫలితంగా కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ ప్రాథమిక విచారణలో అక్రమాలు గుర్తించింది. సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించిగా అది నీరుగారే పరిస్థితి కనిపిస్తోంది.

రిక'వర్రీ'

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్‌కు మొండిచేయి చూపించింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఎస్సీ నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ పెట్టుకున్నారు. కానీ ఏడాదిన్నరగా నిధులు విడుదల చేయలేదు. ఎస్సీ కార్పొరేషన్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో రుణాలు పొందిన వారు తిరిగి చెల్లిస్తేనే కొత్తవారికి ఇస్తామని కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. అంటే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా కొత్తగా విడుదల కాబోదు. మొండి బకాయిలు చెల్లిస్తేనే వాటిని తిరిగి కొత్త వారికి రుణాలుగా ఇస్తామంటూ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ గత బుధవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. గతంలో కార్పొరేషన్‌లో పరిస్థితి ఇలా ఉండేది కాదు. పాత రుణాల వసూలు ఒక వైపు జరుగుతుండగా ప్రభుత్వం నుంచి ఏటా కొత్తగా యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఇప్పుడు యాక్షన్ ప్లానూ లేదు.. ప్రభుత్వం నుంచి నిధులూ రావు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్పొరేషన్‌కు పూర్వవైభవం వస్తుందంటూ కొండంత ఆశలు పెట్టుకున్న ఎస్సీ యువతకు ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది.

ఎరువుల దుకాణం తనిఖీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలునగరంలోని బండ్లమిట్టలో బుధవారం రాత్రి ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ముందుగా ఆషాపులోని రికార్డులను పరిశీలించారు. అనంతరం గోడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎరువుల ధరలను రైతులకు తెలిసే విధంగా బోర్డులు డిస్‌ప్లే చేయాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండులో షాపులను తనిఖీ చేశారు. అక్కడ ధరలతో పాటు శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం గద్దలగుంటలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించడంతో పాటు డ్రగ్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

పంచాయతీలు సొంత ఆదాయంపై దృష్టి పెట్టాలి

- డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీలకు సొంత నిధులు పెంచు కోవాలని డిప్యూటీ ఎంపీడీవో కె .వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశభవనంలో బుధవారం ఉమ్మడి ప్రకాశంజిల్లా పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీలు సొంతనిధులు సమకూర్చుకోవడంపై శిక్షణ జరిగింది. ఈకార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీలలోని అదనపు భవనాలను వేలం వేసి ఆదాయాలు పెంచుకోవాలన్నారు. అలాగే చెరువులలో చేపలు పెంచుకునేందుకు వీలుగా వేలం వేసి ఆదాయం పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మరో డిప్యూటీ ఎంపీడీవో ఎం.మురళి, 56 మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

ఆర్టీసీ ఆదాయం కోసం ప్రత్యామ్నాయ పద్ధతులు అన్వేషించాలి

● సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు

కనిగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులు చేపట్టాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ సురేష్‌రెడ్డితో కలిసి బుధవారం కనిగిరి ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో గ్యారేజీలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకానికి రాష్ట్రంలో 95 శాతం బస్సులు కేటాయించినట్లు తెలిపారు. కనిగిరి డిపో పరిధిలో 65 శాతం బస్సులు స్త్రీశక్తి పథకం కింద నడుస్తున్నట్లు వివరించారు. ఇప్పటికీ కనిగిరి డిపో పరిధిలో 2.93 లక్షల మంది మహిళలు ఉచితంగా స్త్రీశక్తి పథకాన్ని వినియోగించుకున్నట్లు చెప్పారు. ఈ కారణంగా ఆదాయంలో వెనుకబడి నప్పటికీ ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం తీసుకున్న ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీ సిబ్బంది విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. విధుల్లో ప్రమాదాలకు గురై మృతిచెందిన వారి కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. డిపోల్లో ప్రయాణికులకు కల్పించే మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్గో సేవల ద్వారా మరింత ఆదాయం పెంచుకునేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో కొబ్బరిపీచు రవాణా చేయటం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. కార్గో విభాగం ద్వారా రాష్ట్రంలో రూ.220కోట్ల ఆదాయం సమకూరుతున్నట్లు తెలిపారు. కనిగిరి ప్రాంతంలో ఆర్టీసీ ఆదాయం పెరగాలంటే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి ప్రజా రవాణా శాఖ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బస్సు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన కండక్టర్‌లకు, డ్రైవర్లకు బహుమతులు అందజేశారు. తొలుత డిపో గ్యారేజీలో మొక్కలు నాటారు. సభానంతరం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఎండీ తిరుమలరావును ఘనంగా సత్కరించి సన్మానించారు.

పొగాకు రైతులు నాణ్యత పెంపుపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న చిడిపోతు యశ్వంత్ కుమార్

కొండపి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు తమకు కేటాయించిన కోటాకు లోబడి మాత్రమే పొగాకు సాగు చేయవలసిందిగా బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ తెలిపారు. బుధవారం కొండపిలో రైతులు ఏర్పాటు చేసిన సమావేశంలో యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ బ్రెజిల్, జింబాబ్వే, చైనాలో అధిక పొగాకు ఉత్పత్తి కారణంగా ప్రస్తుతం మన రైతులు తాము పండించిన పొగాకును మంచి ధరలకు అమ్ముకోవటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోగ్రేడ్ పొగాకు అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయని తెలిపారు. 2025-26 సంవత్సరం రైతులు విధిగా పొగాకు పంట నియంత్రణ పాటించి నాణ్యత పెంపుదలపై దృష్టి సారించాలని రైతులకు తెలిపారు. వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుంచి రిజిస్ట్రేషన్ మూడేళ్లకు ఒకసారి మంజూరు చేయటం జరిగింది.

టంగుటూరులో...

బుధవారం టంగుటూరులో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ పొగాకు బోర్డును సందర్శించి అనంతరం మాట్లాడుతూ పొగాకు గిరాకీని, నిల్వలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో 2024-26 పంట కాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తి అనుమతించినట్టు తెలిపారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.321

ఒంగోలు (రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో బుధవారం జరిగిన వేలంలో నాణ్యమైన పొగాకు కిలో రూ.321 వ్యాపార సంస్థల ప్రతినిధులు (బైరలు) కొనుగోలు చేశారు. లోగ్రేడ్ పొగాకు కిలో ధర రూ.110 వ్యాపార సంస్థల ప్రతినిధులు కొనుగోలు చేశారు. మొత్తం 1056 బేళ్లు బోర్డుకు రాగా 688 బేళ్లను కొనుగోలు చేశారు. 278 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

కొండపి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కట్ట వారిపాలెం గ్రామంలో పిడుగుపాటుకు గురై గొర్రెల కాపరి బెజవాడ రామారావు(42) మృతి చెందాడు. రామారావు పొలాల్లో గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఆ సమయంలోనే భారీ వర్షంతో పాటు పిడుగు పడి ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. రామారావుతో పాటు అతని తమ్ముడు రమేష్‌కు కూడా గాయాలయ్యాయి. అతని తమ్ముడిని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

● 58 కేసులు, రూ.2లక్షల39వేల అపరాధ రుసుం విధింపు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కాపురం ఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం నేరమని అందుకు శిక్షార్హులని అన్నారు. మండలంలో ఏడీఈ, ఏఈ, సిబ్బంది మొత్తం 36 బృందాలుగా 32 గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా, విద్యుత్ మీటర్లు లేకుండా కరెంట్ వాడుతున్న వారిపై 58 కేసులు నమోదు చేసి రూ2లక్షల39వేలు అపరాధరుసుము విధించినట్లు తెలిపారు.

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి

మూడేళ్లు జైలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కానే వెంకటేశ్వర్లుకు 3 ఏళ్ల జైలు, రూ.15వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయాధికారి కే.శైలజా బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కొమరోలు మండలంలో ఓ గ్రామంలో 2022 జూలై 7న 13 ఏళ్ల బాలిక ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఇంట్లోకి వెళ్లి బాలిక నోరును ఒక చేతితో మూసి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు అప్పట్లో కొమరోలు ఎస్సైగా పనిచేస్తున్న సాంబశివరావు కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు తమ వాదనలు వినిపించారు.

దోపిడీ కేసులో నేరస్తుడికి రెండున్నరేళ్లు జైలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన కేసులో రావిపాటి జగదీష్‌కు రెండున్నర ఏళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు 3వ అదనపు ఏఎంఎం (అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్) వి.నవ్యశ్రీ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గత ఏడాది ఆగస్టు 3న ఒంగోలులోని అంకమ్మపాలెంలో నివాసం ఉంటున్న పటాపంజుల సుగుణమ్మ ఇంటికి తాళ్ళూరు మండలం శివరాంపురానికి చెందిన జగదీష్ వెళ్లి ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. పథకం ప్రకారం తనతో తెచ్చుకున్న ఆయుధంతో సుగణమ్మను బలంగా కొట్టాడు. ఆమె స్పృహ తప్పి కింద పడిపోయింది. జగదీష్ అమె మెడలో ఉన్న బంగారం ఆభరణాలు అపహరిచుకొని వెళ్లాడు. ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాదారాలను పరిశీలించిన న్యాయాధికారి జగదీష్‌పై నేరం రుజువు కావడంతో రెండున్నర ఏళ్ళు జైలు, రూ5వేలు జరిమాపా విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున సీనియర్ ఏపీపీ కె.కళావతి తమ వాదనలు వినిపించారు.

మోదేపల్లి మేజరుకు నిలిచిన సాగర్ జలాలు

● నీటి ఎద్దడితో నెర్రలు కొట్టిన వరి నారుమళ్లు ● ఆందోళనలో ఆయకట్టు పరిధిలోని రైతులు



చుక్కనీరు లేని మోదేపల్లి మేజరు కాలువ

ముండ్లమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదేపల్లి మేజరుకు సరఫరా అవుతున్న సాగర్ జలాలు రెండు రోజుల నుంచి పూర్తిస్థాయిలో నిలిపి వేశారు. దీంతో ఆయకట్టు పరిధిలోని మాగాణి భూములు సాగు చేసేందుకు వరి నారు మళ్లు పోయటంతో నీటి ఎద్దడితో నెర్రెలు కొట్టాయి. దీంతో రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. నాగార్జున సాగర్‌లో నీరు పుష్కలంగా ఉన్నా పమిడిపాడు బ్రాంచ్‌కి 350 క్యూసెక్కుల నీరు సరఫరా చేశారు. అవి పూర్తిగా ఎగువ ప్రాంతమైన పల్నాడు జిల్లాకు సరిపోవటంతో దిగువ ప్రాంతమైన మోదేపల్లి మేజరుకు చుక్క నీరు కూడా రావటం లేదు. దీంతో ఎన్ఎస్‌పీ అధికారులు పూర్తిగా మేజరుకు సాగర్ జలాలు నిలిపి వేశారు. దీని వెనుక ఎన్ఎస్‌పీ ప్రధాన అధికారుల ఏకపక్ష నిర్ణయమేనని మేజరు పరిధిలోని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. మేజరు పరిధిలో 32వేల ఎకరాలు భూములు ఉన్నాయి. అందులో సగం వరి సాగు భూములే. మేజరు పరిధిలో గాంధీ నగర్, వేముల, కొమ్మవరం, ఈదర, రమణారెడ్డిపాలెం, వేములబండ, ఉమామహేశ్వర అగ్రహారం, భీమవరం, నాయుడుపాలెం, మారెళ్ళ, సుంకరవారిపాలెం, తూర్పుకంభంపాడు, శంకరాపురం, పోలవరం, బాపట్ల జిల్లా కుంకుపాడు, మోదేపల్లి గ్రామాల్లో రైతుల భూములకు నీరు చేరాల్సి ఉంది. ప్రస్తుతం పీబీసీకి 750 క్యూసెక్కులపైగా నీరు ఇవ్వాల్సి ఉంది. అవి పూర్తిస్థాయిలో సరఫరా చేసినట్లయితే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ కేవలం 350 క్యూసెక్కులు మాత్రమే నీరు సరఫరా అవుతున్నాయి. దీంతో మోదేపల్లి మేజరుకు కేవలం వంద క్యూసెక్కులు కూడా మూడు రోజుల క్రితం రాలేని పరిస్థితి నెలకొంది. బుధవారం నుంచి పూర్తిగా కాలువకు నీరు నిలిపి వేశారు. కొంత మంది రైతులు మోటార్లను ఆధారం చేసుకొని వరి పైర్లు సాగు చేయగా మరి కొంత మంది రైతులు ఆరు తడి పంటలైన మొక్కజొన్న, కంది, మిరప లాంటి పైర్లు సాగు చేశారు. ఇంకొంతమంది రైతులు వరి సాగు చేసేందుకు నార్లు పోశారు. నార్లకు ప్రస్తుతం నీరు అవసరం కావటంతో నీరు పూర్తిగా నిలిపి వేయటం వల్ల నారు మళ్లు నెర్రులు కొట్టాయి. దీంతో రైతులు ఒక్కసారిగా కాలువ మీదకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడగా వారి నుంచి సరైన సమాధానం కూడా రాలేదు. దీంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. పూర్తిగా మోదేపల్లి మేజరుకు నీరు ఆపి పమిడిపాడు బ్రాంచ్ ఎగువ ప్రాంతానికే నీరు సరఫరా చేయటంలో అంతర్యం ఏమిటో అర్థం కావటం లేదు. ఇప్పటికైనా ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించి మోదేపల్లి మేజరుకు నీరు విడుదల చేసి రైతుల నారుమళ్లు ఎండిపోకుండా చూడటంతో పాటు మెట్ట పైర్లు కంది, మిరప, మొక్కజొన్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

సాగర్ జలాలను తక్షణమే విడుదల చేయాలి

మోదేపల్లి మేజరుకు సరఫరా అవుతున్న సాగర్ జలాలు మంగళవారం నుంచి నిలుపుదల చేయటంతో ఆయకట్టు పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసేందుకు నారుమళ్లు ముమ్మరంగా పోశారు. మొక్కజొన్న, కంది, మిరప పంటలు కూడా సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో సాగర్ జలాలు నిలిపి వేయటం వెనుక ప్రధానంగా అధికారుల ప్రమేయం ఉన్నట్టు రైతులు భావిస్తున్నారు.

-కె.శ్రీనివాసరావు, డీసీ చైర్మన్, మోదేపల్లి మేజరు

అవసరాలకు సరిపడా ఎరువుల పంపిణీ

● జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదు ● వదంతులను నమ్మొద్దు ● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ముండ్లమూరులో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ముండ్లమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు పంపిణీ చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, యూరియాతోపాటు అన్ని రకాల ఎరువులు అవసరానికి సరిపడా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యూరియా పంపిణీపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో చేపట్టిన మెగా ఔట్ రీచ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్న లక్ష్యంతో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో యూరియా కొరత ఉందని అపోహతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి రైతులను చైతన్య పరచి ఔట్ రీచ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారన్నారు. మారుతున్న కాలానుగుణంగా 25 శాతం మేర ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా, జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. డ్రోన్ వినియోగం, నానో యూరియా, డీఏపీ పిచికారీ విధానాన్ని రైతులకు చాలాప్రయోజనంగా ఉంటుందని చెప్పారు. రైతులు సాంకేతికతను అందిపుచ్చుకొని వ్యవసాయం లాభసాటిగా మార్చాలని సూచించారు. ఏ పంటకు ఎంత మోతాదు యూరియాను వాడాలో తెలుసుకోవాలన్నారు. ఎక్కువ యూరియా వాడటం వల్ల భూసారం తగ్గిపోతుందని చెప్పారు. యూరియాపై క్షేత్ర స్థాయిలో ఎలాంటి పుకార్లను నమ్మవద్దని రైతులకు సూచించారు. అనుమానాలు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబరు 83310 57078కి ఫోన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 62వేల హెక్టార్లలో పంటలు సాగు చేశారని, వాటికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా మండలంలోని సింగనపాలెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. సాగు చేసిన రైతులతో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చు అధిక దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జేడీఏ వీ శ్రీనివాసరావు, మార్కెఫెడ్ మేనేజర్ హరికృష్ణ, దర్శి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త రమేష్, సబ్ కలెక్టర్ వరకుమార్, జిల్లా ఇన్‌చార్జ్ డీపీవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏడీఏ బాలాజీ నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ రహీం, మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ గీతాంజలి, మాజీ సర్పంచ్ నరసింహారావు, మాజీ పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కందిమళ్ళ చంద్రమౌళి పాల్గొన్నారు.

ఒకేరోజు జిల్లాకు రెండు బృందాలు

● కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం

● పీహెచ్‌సీల పరిశీలనకు ప్రపంచ బ్యాంకు బృంద సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందుతున్న ప్రభుత్వ వైద్య సేవలను పరిశీలించేందుకు జిల్లాకు రెండు బృందాలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం రాగా, జిల్లాలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, విలేజ్‌హెల్త్ క్లినిక్‌లను పరిశీలించేందుకు ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం జిల్లాకు చేరుకుంది. ముందుగా కేంద్ర బృందం ఒంగోలు చేరుకొని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులతో జిల్లాలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు బృందం కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వోతో పాటు ఆ శాఖ అధికారులతో భేటీ అయ్యారు. జిల్లాలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను ప్రపంచ బ్యాంకు బృందం సభ్యుడు డాక్టర్ అజయ్‌మిశ్రా బృందానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న వైద్యసేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు వివరించారు. ఈ బృందం సభ్యులు జిల్లాలో ఎంపిక చేసిన 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ వైద్య సేవలను పరిశీలించడంతో పాటు ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు. కిల్కారి కేంద్ర బృందం సభ్యులు అమిత్, కిరణ్, భూషణ్‌లు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కిల్కారి పీవో రాజు, డీసీఎం రాజేశ్వరితో భేటీ అయ్యారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలను కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. జిల్లాలో గర్భిణులు, బాలింతలకు కిల్కారి కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. గర్భిణి నాల్గవ నెల నుంచి ఏడాది వరకు కిల్కారి కాల్స్ చేసి వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వివరించడం జరుగుతుందని కేంద్ర బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అందుకు సంబంధించిన ఏర్పాటు చేసిన ఫోన్ నెంబరుతో పాటు టోల్‌ఫ్రీ నెంబరును కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రెండు బృందాలు నాలుగు రోజుల జిల్లాలో పర్యటించనున్నాయి.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

● జోసఫ్ కుమార్



వైద్యశాలను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

త్రిపురాంతకం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న జ్వరాల తీవ్రత దృష్ట్యా పలు మండలాల్లోని ప్రభుత్వ వైద్యశాలలను ఆయా మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేశారు. అందులో భాగంగా త్రిపురాంతకంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. వైద్యసేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితిని సమీక్షిస్తూ జ్వరాల కట్టడికి చర్యలు తీసుకోవాలని అన్నారు. రోగులకు అవసరమైన పరీక్షల కిట్లు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి జవహర్, ఎంపీడీవో రాజ్‌కుమార్ ఉన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నీటి కుంటలను మండల ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్‌రావు బుధవారం పరిశీలించారు. మండలంలోని మొగుళ్లపల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కుంటల ద్వారా వృథాను అరికట్టవచ్చన్నారు. అనంతరం వైద్యశాలను, హెల్త్ క్లినిక్ సెంటర్లను, సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఏపీవో శైలజ, నాగేశ్వరరావు, టీఏ గౌసియ, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

తీరు మార్చుకోకపోతే చర్యలు

రాచర్ల : వైద్య, సచివాలయ సిబ్బంది తమ పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. అనుములవీడు ప్రాథమిక వైద్యశాల, సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఆయా కార్యాలయాల సిబ్బంది పూర్తి స్థాయిలో విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి హాజరు పట్టికలో లేకపోయినా ఉన్నట్లు మరికొందరు రాకపోయినా ఫీల్డ్‌లో ఉన్నారని చెప్పడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. మరికొందరైతే ఏకంగా నాలుగు, ఐదు రోజులు కూడా హాజరు వేసుకోకపోవడంపై అడిగితే రెగ్యులర్ అక్కడ ఇన్‌చార్జి అనడం, మరికొందరు లేకపోయినా ఉన్నట్లుగా హాజరు వేసుకోవడం ఏంటని నిలదీశారు. కార్యాలయాలు, పరిసరాలు పరిశుభ్రంగా లేవని, పారిశుధ్యంపై మీరు ఏమి సర్వేలు చేస్తున్నారు, ఏమి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. విధుల్లో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై వారు పూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకొని సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

డిస్టెన్స్ ఎడ్యుకేషన్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న ALL MA, ALL M.Sc, M.Com, M.S.W, MHRM, MCA & MBA కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. MBA & MCA అర్హత పరీక్ష 21-9-2025 జరుగును. సంప్ర: గీతం డిగ్రీ కాలేజ్, ఒంగోలు సెల్: 98491 24970, 90305 68558.

AJO-241107

RC మ్యారేజ్ లింక్స్

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ (US గవర్నమెంట్) Job చేయువారికి తక్షణమే వివాహ సంబంధాలు కుదర్చబడును. సంప్రదించండి. RC మ్యారేజ్ లింక్స్, ఒంగోలు. సెల్: 9966453591

AJO-241125

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆసుపత్రికి వచ్చి అనంతలోకాలకు..

● మృత్యువు రూపంలో కబళించిన వాహనం

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన ఇనుకొల్లు వెంకటసుబ్బారావు (76)ను మృత్యువు రూపంలో వచ్చిన టాటా ఏస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన స్థానిక సత్యనారాయణపురంలోని దిబ్బలరోడ్డులో బుధవారం జరిగింది. జరుగుమల్లి మండలం కే.బిట్రగుంటకు చెందిన వెంకటసుబ్బారావు ఆర్టీసీ డిపో సమీపంలో ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఒంగోలు వచ్చి రక్తనమూనాలు ఇచ్చాడు. రిపోర్టు కోసం వేచి ఉన్న వెంకటసుబ్బారావు డిపో ఎదురుగా వై ప్యాలెస్ పక్కన ఉన్న దిబ్బలరోడ్డులో నిలబడి ఉన్నాడు. అదే రోడ్డులో కోడిగుడ్ల లోడుతో వెళుతున్న టాట ఏస్ వాహనం నడుపుతున్న డ్రైవర్ అదుపుతప్పి అక్కడ నిలబడి ఉన్న వెంకటసుబ్బారావును ఢీకొట్టాడు. దీంతో అయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఒంగోలు తాలుకా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వార్డెన్‌లు అందుబాటులో ఉండాలి

● ప్రత్యేకాధికారి జయ, ఎంపీడీవో వీరభద్రాచారి



కంభం మండల వార్డెన్లకు సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి, ఎంపీడీవో

కంభం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లలో వార్డెన్లు అందరూ విద్యార్థులకు అందుబాటులో ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ జయ, ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'వసతులు కరువు' శీర్షికన వచ్చిన కథనంపై స్పందించిన ప్రత్యేకాధికారి, ఎంపీడీవో హాస్టళ్ల వార్డెన్లను కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇప్పుడు మీ ఆత్మీయులకు, ప్రకటనల ద్వారా మరింత చేరువకండి.

వివాహ, షష్టిపూర్తి, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

ఉద్యోగ, వ్యాపార, లీగల్ ప్రకటనలు,

శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి

మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 95053 05888, 97036 18694, 96525 55752, 99854 11483

చీరాల : 99859 21376

మార్కాపురం : 99859 21358

కందుకూరు : 97036 18697

కనిగిరి : 99854 11071

గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు మరియు పేపరు పంపిణీ విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నా సంప్ర॥

సర్క్యులేషన్ మేనేజర్ : 9985411484



నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

మూలనపడిన అంబులెన్స్

అధికారుల నిర్లక్ష్యం

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం సర్వజన వైద్యశాలలో అధికారుల నిర్లక్ష్యంతో రూ.40లక్షల విలువైన అధునాత అంబులెన్స్ మూలనపడింది. 2022లో కరోనా సమయంలో ఓ సంస్థ నిర్వాహకులు స్వచ్ఛందంగా అన్ని సౌకర్యాలున్న అంబులెన్స్‌ను ఆసుపత్రికి ఇచ్చారు. అది ప్రారంభమైన కొద్ది రోజులకే ఓ పేషంట్‌ను హైదరాబాద్ తీసుకెళ్లే క్రమంలో వాహనానికి పైన ఉన్న ఏసీ సిస్టమ్ దెబ్బతిన్నది. అప్పటి నుంచి అంబులెన్స్‌ను ఉపయోగించలేదు. మరమ్మతులను కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా మూలన పడేశారు. ఎంతో విలువైన, సౌకర్యాలున్న అంబులెన్స్‌ను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

- అందుబాటులో ఎరువులు
- రైతులు, డీలర్ల అవగాహన కార్యక్రమంలో అధికారులు

గిద్దలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడా యూరియా ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన చెంద వద్దని మండల స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.శివరామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో యూరియా ఔట్‌రిచ్, నల్లపొగాకు సాగు నిషేధంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎరువులు సకాలంలో రైతు సేవా కేంద్రాల నుంచి, ప్రైవేటు దుకాణాల నుంచి రైతులకు అవసరమైన మేర అందజేస్తామని అన్నారు. తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం వలన భూసారం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, విస్తరణాధికారులు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

రాచర్ల : యూరియా సమృద్ధిగా అం దుబాటులో ఉందని ఆందోళన అవసరం లేదని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో యూరియా అవుట్ రీచ్ నల్లబర్లీ పొగాకుపై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి డీలర్లు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంఈవో షేక్ మొయినుద్దీన్, ఎస్సై పీ కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ జ్యోతి, పశువైద్యాధికారి హరిబాబు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : యూరియాపై రైతులు అపోహలు. ఆందోళన చెందవద్దని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారిగా ఇక్కడి పరిస్థితిపై సమీక్షించానని యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ఇప్పటికే మండలానికి 250 టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఏపీవో సుజాత, వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : అధికారుల సిఫారసుల మేరకే యూరియా వాడేలా రైతులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస ప్రసాద్ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు అశోక్‌కుమార్, ఎంఈవో మస్తాన్, హౌసింగ్ డీఈఈ సురేష్‌బాబు, ఏఈ శివ శంకర్, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పొదిలి : యూరియా గురించి రైతులు ఆందోళన చెందవద్దని మండల ప్రత్యేక అధికారి అర్జున్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో యూరియా వాడకంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కడ యూరియా కృత్రిమ కొరత సృష్టించవద్దని ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, ఏవో డీ శ్రీనివాసరెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇమాంసాహెబ్, మాదిరెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రామాపురం కొండలు, గోగినేని వెంకట్రావ్, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం డివిజన్ పరిధిలో రైతులకు కావాల్సిన యూరియాకు కొరత లేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో బుజ్జి బాయిలతో కృష్ణారావు మాట్లాడారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : యూరియా కొరత లేదని మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.విష్ణువర్ధన్‌రావు అన్నారు. ఎర్రగొండపాలెం లో బుధవారం యూరియా ఔట్‌రిచ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో నీరజ, వెంగళరెడ్డి, వెంకటసుబ్బయ్య, అంజయ్య, మహేష్, రైతు సేవా కేం ద్రాల వీఏఏలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకొని నానోయూరియా, నానో డీఏపీలను వాడాలని చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యూరియా ఔట్‌రిచ్ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ, ఏపీవో బులెన్‌రావు, ఈవోఆర్డీ శ్రీదేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు : రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ అధికారి జోత్స్నదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఫెర్టిలైజర్స్ డీలర్లు, రైతులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్, ఎంపీడీవో బుర్రి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులు, డీలర్లు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

విద్యార్థి కుటుంబానికి టీచర్ల సాయం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పులుకూరి పవన్‌కుమార్ ఇటీవల ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. ఆ విద్యార్థి తండ్రి చిన్నపుడే చనిపోగా, తల్లి అంధురాలు. ఆమెకు మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో స్పందించిన పాఠశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ప్రధానోపాధ్యాయిని శ్యామ్ ప్రసన్నతాంజలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో రూ.31,000 నగదును విద్యార్థి తల్లికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, విజయ మాణిక్యం, అనసూయదేవి, రామానాయక్ పాల్గొన్నారు.

దాడులు పునరావృతం కాకుండా చూడాలి

గిద్దలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కొత్తవలస గ్రామంలో రజకులపై జరిగిన దాడి, హత్య నేపథ్యంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దాడులు పునరావృతం కాకుండా చూడాలని రజక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దాడులను ఖండిస్తూ తహసీల్దార్ అంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అట్రాసిటీ చట్టం వలే రజకులకు భద్రత, రక్షణ కల్పించాలని, కోరారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు పాలకవీటి బాలచెన్నయ్య, కార్యదర్శి గురువయ్య, గౌరవాధ్యక్షులు ఆవులమంద శ్రీనివాసులు, మడలేశ్వరస్వామి దేవస్థాన అధ్యక్షులు కాదరయ్య, కార్యదర్శి రామాంజనేయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

తొలగింపుపై నిరసన

గిద్దలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ శానిటైజర్ ఆయాపై రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించడాన్ని సీఐటీయూ నాయకులు తప్పుపట్టారు. పాఠశాల ఆవరణలో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సంఘ జిల్లా సహాయ కార్యదర్శి ఆవులయ్య మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్ ఆయా అయిన సబీరా తొలగింపును ఆపాలని కోరారు.

ఏచూరికి నివాళి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పీడిత, కార్మిక వర్గాల కోసం నిరంతరం పోరాడిన నేత ఏచూరి సీతారం సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ నివాళి అర్పించారు. మూడో వార్డులో ఏచూరి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రూబెన్, రాజు, కాశయ్య, నన్నెసా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కార్మికుల నమోదు కార్యక్రమం ప్రారంభం

గిద్దలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెత్త కాగితాలు, ప్లాస్టిక్ డబ్బాలు సేకరించి జీవనం సాగించే కార్మికుల నమోదు కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ స్టేట్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రక్రియ చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుకునే వారు, జట్టు సేకరించే వారు, అనధికార పారిశుధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. వృత్తికి ఉపయోగపడే పీపీఈ కిట్లను అందచేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్లను గుర్తించి వారికి ఆధార్‌కార్డులు ఇప్పిస్తామని, జీరో బ్యాంక్ అకౌంట్‌లు చేయిస్తామని, వీరి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తామని పేర్కొన్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ సేవలు



అమృతను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

రాచర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తక్కువ సమయంలో ఎక్కువ సేవలందించడం అభినందనీయమని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొంది మార్కాపురం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న డీ అమృత వర్షిణిని బుధవారం కార్యాలయ సిబ్బంది సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్వాతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హర్ష, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జాబీర్



మార్కాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మార్కాపురం పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా 8వ వార్డుకు చెందిన మొఘల్ జాబీర్ హుసేన్‌బేగ్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బుధవారం నూతన కమిటీని ప్రకటించింది. కమిటీ ఉపాధ్యక్షుడిగా చిన్నఖాశింసాహేబ్, షేక్ ఖాశింవలి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాశింసాహేబ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అబ్దుల్ కరీం బాషా, షేక్ షఫీ, షేక్ నాగూర్‌వలి, కార్యదర్శులుగా షేక్ దీనావలి, సయ్యద్ మౌళాలి, షేక్ మస్తాన్‌వలిని నియమించారు. ఈ సందర్భంగా జాబీర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పజెప్పిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా



పార్వతమ్మను సన్మానిస్తున్న కంభం విశ్వబ్రాహ్మణ సంఘం

కంభం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కార్పొరేషన్ ద్వారా కృషి చేస్తామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ తెలిపారు. విజయవాడ నుంచి కర్నూలు వెళ్తూ కంభం పట్టణంలోని చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం (సూపర్‌స్టార్) గృహానికి రాగా కంభం మండల విశ్వబ్రాహ్మణుల సంఘ చైర్మన్ ఆమెను మాట్లాడారు. జిల్లాల్లో వెనుకబడిన ప్రాంతమైన కంభం మండలంలో చేతివృత్తులతో జీవనం సాగిస్తున్న 100 కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరంతా పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారకి ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పార్వతమ్మ స్పందిస్తూ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సహకారంతో అర్హులందరికీ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంభం మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారు పాల్గొన్నారు.

ఆ పిల్లలకు ఫీజులు అడిగితే చర్యలు

కంభం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో ఆర్‌టీఈ (12)1 సీ చట్టం ద్వారా కేటాయించిన 25శాతం ఉచిత ప్రవేశాలకు ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంఈవో అబ్దుల్ సత్తార్ అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ఆర్టీఈ ద్వారా 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించాలన్నారు. వారికి ఫీజు మినహాయింపు ఇవ్వాలని ఆదేశించారు. మండలంలోని ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఆర్‌టీఈ (12) 1సీ ద్వారా ఉచితంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్కూల్ మెయింటినెన్స్ ఫీజు పేరును ఒత్తిడి చేస్తున్నారంటూ తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత పాఠశాలలకు బుధవారం నోటీసును ఇచ్చినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు వసూలు చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టైలర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ టైలర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక స్థానిక క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పీవీ కృష్ణారావు, అధ్యక్షులుగా వడ్డెపల్లి రాము, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా షేక్ వలి, సహాయ కార్యదర్శిగా మొయిద్దీన్, కోశాధికారిగా కంచర్ల ధనూష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. టైలర్స్ ఎవరైనా ఆపదలో ఉంటే వారిని ఆదుకుంటామని, చనిపోతే మట్టి ఖర్చులకు రూ.5వేలు ఇస్తామన్నారు. టైలర్ యూనియన్‌కు సొంత భవనం ఉందని, ఆ భవనాన్ని ప్రజల సౌకర్యార్థం సచివాలయానికి ఇచ్చామన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

కంభం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బోర్డు స్కూల్ భవిత కేంద్రంలో బుధవారం ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు దివ్యాంగ విద్యార్థులకు సీపీ చైర్లు తదితర ఉపకరణాలను పంపిణీ చే శారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారుల జీవన శైలిపై తల్లిదండ్రులతో చర్చించారు. చిన్నారులతో ఎలా ఉండాలో వివరించారు. అనంతరం ఫిజియోథెరఫిస్ట్ సంధ్య చిన్నారులకు శారీరక చికిత్సలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు నూర్జహాన్, హెచ్ఎం వీ వెంకటేశ్వర్లు, ఐఈఆర్పీలు అరుణ్‌కుమార్ ఈశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువులేని వారిని అక్షరాస్యులుగా చేయాలి

పొదిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చదువులేని మహిళలపట్ల శ్రద్ధతో వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీడీ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో శోభన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలు, వలంటరీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణలో మాట్లాడారు. చదువులేని మహిళలు ఉంటే రాత్రి బడిలో చదువు నేర్పించాలని చెప్పారు. శ్రీనిధిలో కూడా కొత్తలోన్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం గోపాలకృష్ణ, నాగభూషణం, శ్రీనిధి మేనేజర్ సులోచన, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నీసా, ఓబి మెంబర్స్ పాల్గొన్నారు. అనంతరం అక్షరాంధ్ర పుస్తకాలను పంపిణీ చేశారు.

మార్కాపురం డీడీగా అబ్దుల్ రవూఫ్



మార్కాపురం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు టైగర్, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్‌గా షేక్ మహ్మద్ అబ్దుల్ రవూఫ్ ఉద్యోగోన్నతిపై మార్కాపురం బదిలీ అయ్యారు. ఈయన ప్రస్తుతం ప్రాజెక్టు టైగర్, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. 2022 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి రాష్ట్ర వ్యాప్తంగా పది మంది ఐఎఫ్ఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సందీప్ కృపాకర్ అరణ్య భవన్, మంగళగిరి హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు.

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

పొదిలి : మండలంలో విషజ్వరాలు ప్రబలుతున్న క్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పలపాడు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. అనంతరం ఆయన రోగులతో మాట్లాడారు.

రిక'వరీ'

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్‌కు మొండిచేయి చూపించింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఎస్సీ నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ పెట్టుకున్నారు. కానీ ఏడాదిన్నరగా నిధులు విడుదల చేయలేదు. ఎస్సీ కార్పొరేషన్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో రుణాలు పొందిన వారు తిరిగి చెల్లిస్తేనే కొత్తవారికి ఇస్తామని కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. అంటే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా కొత్తగా విడుదల కాబోదు. మొండి బకాయిలు చెల్లిస్తేనే వాటిని తిరిగి కొత్త వారికి రుణాలుగా ఇస్తామంటూ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ గత బుధవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. గతంలో కార్పొరేషన్‌లో పరిస్థితి ఇలా ఉండేది కాదు. పాత రుణాల వసూలు ఒక వైపు జరుగుతుండగా ప్రభుత్వం నుంచి ఏటా కొత్తగా యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఇప్పుడు యాక్షన్ ప్లానూ లేదు.. ప్రభుత్వం నుంచి నిధులూ రావు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్పొరేషన్‌కు పూర్వవైభవం వస్తుందంటూ కొండంత ఆశలుపెట్టుకున్న ఎస్సీ యువతకు ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది.

తొలి విడత విచారణ తూచ్

(5వ పేజీ తరువాయి)

ఆయనకు సహాయకులుగా ఎన్టీఆర్ జిల్లాలోని ఒక డీఎల్‌సీవోను, గుంటూరులోని ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వగా వారిని కూడా తన వెంట తీసుకొని రాలేదని తెలిసింది. మొత్తం మీద రెండు రోజుల షెడ్యూల్‌లో బుధవారం మధ్యాహ్నం పీడీసీసీ బ్యాంకుకు వెళ్లి కొద్దిసేపు మాత్రమే ఉన్న ఆయన అప్పుడు బ్యాంకు అధికారులకు నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం డీసీవో కార్యాలయానికి వెళ్లి సాయంత్రం తిరిగి గుంటూరు వెళ్లిపోయారు. ఇదేసమయంలో పీడీసీసీ బ్యాంకుపై సెక్షన్ 51 విచారణకు స్థానికంగా కీలకంగా ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యే సానుకూలంగా లేరన్న సంకేతాలు బ్యాంకు పరిస్థితిని బట్టి కనిపిస్తున్నాయని, అలా అయితే విచారణ కొనసాగించడం అవసరం లేదన్న రీతిలో ఆయన కొందరితో మాట్లాడినట్లు సహకార శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. మొత్తం మీద గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున బ్యాంకులో అక్రమాలు జరిగాయని సీఎంకు ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ ఫిర్యాదు చేయడం, మంత్రి డాక్టర్ స్వామి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడిన ఫలితంగా కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ ప్రాథమిక విచారణలో అక్రమాలు గుర్తించింది. సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించిగా నీరుగారే పరిస్థితి కనిపిస్తోంది.







పాముకాటుకు వివాహిత మహిళ మృతి

దొనకొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురై వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని బాదాపురంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి చెందిన చిలకా అక్కమ్మ(28) భర్త, పిల్లలతో హైదరాబాద్‌లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పొదుపు గ్రూపులో ఆమె సభ్యురాలైనందున బ్యాంకులో రుణం తీసుకునేందుకు మంగళవారం దొనకొండ వచ్చింది. చీకటి పడటంతో దొనకొండకు దగ్గరలోని బాదాపురంలోని తన అక్క ఇంటికి వెళ్లింది. అక్క ఇంట్లో వరండాలో రాత్రి నిద్రిస్తుండగా తెల్లవారుఝామున పాము కాటుకు గురైంది. బంధువులు మార్కాపురం వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలు మామ ఆశీర్వాదం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ త్యాగరాజు తెలిపారు. మృతిచెందిన మహిళకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రేషన్ షాపు తనిఖీ

తాళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్రపాటివారిపాలెం రేషన్ షాపును తహసీల్దార్ బి.వి.రమణారావు, ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ రాధాకృష్ణమూర్తిలు బుధవారం తనిఖీ చేశారు. గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయటంతో అధికారులు రేషన్‌షాపును తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తనిఖీ నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై భయపడొద్దు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

కలెక్టర్ తమీమ్ అన్సారియా


సింగన్నపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ముండ్లమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులైన విషజ్వరాలు, చికున్‌గున్యా వ్యాధులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధులు సోకిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. ఆమె బుధవారం ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపీల రిజిస్టర్‌ను పరిశీలించారు. రోజూ ఎంత మంది జ్వరం, ఇతర వ్యాధులతో ఆస్పత్రులకు వస్తున్నారు? వారికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారని వైద్యాధికారులు ఎం జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. జ్వరపీడితులకు చేస్తున్న రక్త పరీక్షలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.జ్వరం సోకిన బాధితులు అనవసరంగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంచి సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఫార్మాలజిస్టు యుగంధర్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. గుండె, కుక్క కాటు లాంటి మందులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామాల్లో జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలన్నారు. ప్రధానంగా కాచి చల్లార్చిన నీటినే తాగే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఫాగింగ్, కాలువల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడ ర్, ఎబెట్ పిచికారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముందుగా సింగనపాలెంలో ఇంకుడు గుంతలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఏపీవో టీ వెంకటరావు, సొసైటీ అధ్యక్షుడు కోయి శివరామకృష్ణ, ఈసీ శివరామకృష్ణ, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎం నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కందిమళ్ల చంద్రమౌళి ఉన్నారు.

మోదేపల్లి మేజరుకు సరిపడా నీరు సరఫరా చేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియాను మోదేపల్లి మేజరు పరిధిలో డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు నేతృత్వంలో పలు గ్రామాల సాగు నీటి సంఘం అధ్యక్షులు కలిశారు. మేజరు పరిధిలో సాగర్ జలాలు సరిపడా స్థాయిలో సరఫరా చేసి రైతులు ఆదుకోవాలని కోరారు. జలవనరుల ఎస్సీతో మాట్లాడి సరిపడా స్థాయిలో నీరు సరఫరా చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

తొలి విడత విచారణ తూచ్

(5వ పేజీ తరువాయి)

ఆయనకు సహాయకులుగా ఎన్టీఆర్ జిల్లాలోని ఒక డీఎల్‌సీవోను, గుంటూరులోని ఒక అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వగా వారిని కూడా తన వెంట తీసుకొని రాలేదని తెలిసింది. మొత్తం మీద రెండు రోజుల షెడ్యూల్‌లో బుధవారం మధ్యాహ్నం పీడీసీసీ బ్యాంకుకు వెళ్లి కొద్దిసేపు మాత్రమే ఉన్న ఆయన అప్పుడు బ్యాంకు అధికారులకు నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం డీసీవో కార్యాలయానికి వెళ్లి సాయంత్రం తిరిగి గుంటూరు వెళ్లిపోయారు. ఇదేసమయంలో పీడీసీసీ బ్యాంకుపై సెక్షన్ 51 విచారణకు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే సానుకూలంగా లేడన్న సంకేతాలు బ్యాంకు పరిస్థితిని బట్టి కనిపిస్తున్నాయని, అలా అయితే విచారణ కొనసాగించడం అవసరం లేదన్న రీతిలో ఆయన కొందరితో మాట్లాడినట్లు సహకార శాఖ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. మొత్తంమీద గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దఎత్తున బ్యాంకులో అక్రమాలు జరిగాయని సీఎంకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫిర్యాదు చేయడం, మంత్రి డాక్టర్ స్వామి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడిన ఫలితంగా కలెక్టర్ నియమించిన త్రిసభ్య కమిటీ ప్రాథమిక విచారణలో అక్రమాలు గుర్తించింది. సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించిగా అది నీరుగారే పరిస్థితి కనిపిస్తోంది.



రిక'వర్రీ'

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్‌కు మొండిచేయి చూపించింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఎస్సీ నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపై కొండంత ఆశ పెట్టుకున్నారు. కానీ ఏడాదిన్నరగా నిధులు విడుదల చేయలేదు. ఎస్సీ కార్పొరేషన్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో రుణాలు పొందిన వారు తిరిగి చెల్లిస్తేనే కొత్తవారికి ఇస్తామని కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. అంటే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా కొత్తగా విడుదల కాబోదు. మొండి బకాయిలు చెల్లిస్తేనే వాటిని తిరిగి కొత్త వారికి రుణాలుగా ఇస్తామంటూ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ గత బుధవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. గతంలో కార్పొరేషన్‌లో పరిస్థితి ఇలా ఉండేది కాదు. పాత రుణాల వసూలు ఒక వైపు జరుగుతుండగా ప్రభుత్వం నుంచి ఏటా కొత్తగా యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఇప్పుడు యాక్షన్ ప్లానూ లేదు.. ప్రభుత్వం నుంచి నిధులూ రావు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్పొరేషన్‌కు పూర్వవైభవం వస్తుందంటూ కొండంత ఆశలుపెట్టుకున్న ఎస్సీ యువతకు ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది.

పేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి

మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన డీఆర్‌డీఏ పీడీ నారాయణ


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నారాయణ

పామూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సంపూర్ణంగా అందేలా అధికారులు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి నారాయణ సూచించారు. మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా పామూరు మండలంలో బుధవారం పర్యటించారు. ముందుగా అయ్యవారిపల్లిలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం బొట్లగూడూరులోని ప్రభుత్వ వైద్యశాలను తనిఖీచేశారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రసాయనిక ఎరువుల వాడకంపై వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. పామూరులో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. స్వామిత్వ సర్వే, జల్ జీవన్ పథకం, ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆర్ వాసుదేవరావు, డిప్యూటి ఎంపీడీవో కె సుందర్‌రామయ్య, డాక్టర్ షేక్ దాదాషరీఫ్, పామూరు కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై రమేష్, హౌసింగ్ ఏఈ సురేష్, ఎంఈవో - 2 కరుణకుమారి, ఏవో అబ్రహంలింకన్, ఏపీఎం విద్యాసాగర్, ఏపీవో మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ నారాయణను ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇళ్లూరి గోపాల్‌రెడ్డి మర్యాపూర్వకంగా కలిశారు.

రుణాల రికవరీకి విజిలెన్స్ బృందాలు

రుణాల రికవరిలో వీవోఏలు బాధ్యత వహించాలని, స్త్రీనిధి, ఉన్నతి, ఎస్సీఎస్టీ రుణాల రికవరీ కోసం ప్రత్యేక విజిలెన్స్ బృందాలను నియమిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ నారాయణ చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో సమావేశం బుధవారం నిర్వహించారు. శ్రీనిధి జిల్లా మేనేజర్ సంపత్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు సుబ్బమ్మ, ఉమ్మడి పద్మావతి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు అందజేయాలి

సీఎస్‌పురం/పామూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలు పేదలకు అందేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఆదుకోవాలని డీఎల్‌డీవో కే శ్రీనివాసరెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో బుధవారం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎండీ హుసేన్, డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ఎంఈవో ప్రసాదరావు, ఎస్‌ఐ ఎం వెంకటేశ్వరనాయక్, ఏవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయసాధనే ధ్యేయం

పామూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఏచూరి వర్ధంతి సభ గౌస్‌బాష అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.

నానో ఎరువుల వైపు మొగ్గు చూపాలి

కురిచేడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి నానో ఎరువుల వినియోగం వైపు మొగ్గు చూపాలని మండల ప్రత్యేకాధికారి బాల శంకరరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేకాధికారి అధ్యక్షతన యూరియా అవుట్ రీచ్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎరువుల గోడౌన్‌లను ఆయన పరిశీలించారు. ఏవో సంపత్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య పాల్గొన్నారు.

పీసీపల్లిలో...

పీసీపల్లి, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదయిర్లపాడులో యూరియా వాడకంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక రైతుసేవాకేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ సీహెచ్.ఉష, ఎంపీడీవో హనుమంతరావులు పాల్గొన్నారు. ఏవో ఎన్.రంగాక్రిష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యశాల తనిఖీ

పీసీపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి పీహెచ్‌సీని తహసీల్దార్ ఉష, ఎంపీడీవో హనుమంతరావులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో మందులు, గర్భిణులకు చిన్నపిల్లలకు అందించే టీకాలు, ఓపి రిజిస్టరు తదితర అంశాలను వారు పరిశీలించారు.

వివరాల్లేక ఎరువుల అమ్మకం నిషేధం

తాళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుగంగవరంలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఏవో శివనాగప్రసాద్ నేతృత్వంలోని బృందం శ్రీశ్రీనివాస, వరలక్ష్మి, ధనలక్ష్మి ఫెర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రూ.1.06లక్షల విలువైన అమ్మోనియం సల్ఫేట్ 5.6 మెట్రిక్ టన్నులు రూ.75వేల విలువైన 20-20--0-13 మూడు టన్నులు, రూ.2.05లక్షల విలువైన 20-20-0-13 7.6టన్నుల అమ్మకాలను నిషేధించారు. ఎరువుల వివరాలునమోదు చేయనందున అమ్మకాలను నిలిపేసినట్లు క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రసాదరావు తెలిపారు.

మెడికల్ షాపునకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

కనిగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు మెడికల్ షాపుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ సంఘటన మండలంలోని బల్లిపల్లి అడ్డరోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... బల్లిపల్లి అడ్డరోడ్డు వద్ద అట్లా రత్తమ్మ మెడికల్, ఫ్యాన్సీ షాపు నడుపుతున్నారు. రాత్రి సమయంలో షాపు నుంచి మంటలు వస్తుండటంతో స్థానికులు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చేసరికేకే షాపు దగ్ధమవుతుంది. స్థానికుల సాయంతో మంటలను ఆర్పేశారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్‌ఐ శ్రీరాం సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో షాపు దగ్ధం చేసిన వ్యక్తుల వివరాలు తెలియటంతో వారి కోసం గాలిస్తున్నారు.



పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

అవీఇవీ

ముండ్లమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూరిమిట్లలో విషజ్వరాలు సోకి మంచం పట్టిన విషయం తెలుసుకున్న ఇన్చార్జి డీపీవో వెంకటేశ్వరరావు బుధవారం ఆ గ్రామాన్ని, అతర్వాత ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం పోలవరం గ్రామాన్ని సందర్శించి వీధులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ రహీమ్, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు చింతలపల్లి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ కోడిగ మస్తాన్‌రావు, చొప్పరపు నాగేశ్వరరావు, కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

అప్రమత్తంగా లేకుంటే చర్యలు తప్పవు

తాళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజన్‌లో వ్యాప్తిచెందుతున్న జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని, గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వకుంటే ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవోలపై చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి డీపీవో, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో మండల స్థాయి అధికారుల సమావేశం బుధవారం జరిగింది. ఏవో బి.వి.ప్రసాదరావు, ఎంపీడీవో సత్యం, తహసీల్దార్ రమణారావు, డిప్యూటీ ఎంపీడీవో హనుమంతరావు, ఏపీఎం దేవరాజ్, ఏపీవో వెంకటేశ్వర్లు, వైద్యులు ప్రవీణకుమార్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఆర్ఎంను అభినందించిన దొనకొండ వాసులు

దొనకొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినందుకు దొనకొండకు చెందిన పలువురు బుధవారం రైల్వే ఉన్నతాధికారులను కలిసి అభినందనలు తెలిపారు. దొనకొండకు చెందిన విశ్వభారతి విద్యాలయం చైర్మన్ మల్లెల రామిరెడ్డి, మాడిశెట్టి రమేష్, షేక్ గఫూర్, జయరాజ్‌లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణసేన్, సీనియర్ డీవోఎం జాగీదర్‌శ్రీనాద్‌లకు పూలబోకేలు అందజేశారు.

ఐదేళ్ల తర్వాత ఆగిన ఎక్స్‌ప్రెస్ రైలు.. ప్రజలు సంబరం

దొనకొండ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : దొనకొండ రైల్వేస్టేషన్‌లో దాదాపు ఐదేళ్ల తర్వాత మచలీపట్నం నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం రాత్రి ఆగింది. దీంతో దొనకొండ ప్రాంత ప్రజల ఆనందంతో రైల్వేస్టేషన్ వద్ద సంబరాలు చేశారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల బ్రహ్మయ్య పాల్గొన్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్ దొనకొండ స్టేషన్‌లో ఆగగానే రైళ్ల స్టాపింగ్‌కు విశేష కృషి చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి అభినందనలు తెలిపేలా నినాదాలు చేశారు. భారీగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సందడి వాతావరణం నెలకొల్పారు.

వైసీపీది దగా పోరు

దర్శి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎక్కడా ఎరువుల కొరత లేకపోయినప్పటికీ వైసీపీ నాయకులు అన్నదాతల పోరు అంటూ దగా పోరు నిర్వహిస్తున్నారని మండల ఐ టీడీపీ కన్వీనర్ వైకే చౌదరి ధ్వజమెత్తారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు అన్నీ ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.ఎరువుల కొరత లేకుండా సీఎం చంద్రబాబు ముందుగానే కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి అవసరమైన మేరకు యూరియాతో పాటు అన్నీ రకాల ఎరువులను తెప్పించారన్నారు. మండల టీడీపీ నాయకులు కామేపల్లి చెంచయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, సింగమనేని హనుమంతు, కుందుర్తి లక్ష్మణ్, పురుషోత్తం సత్యానందం, బూరగ బాబు పాల్గొన్నారు.

యూరియాపై వైసీపీ రాజకీయ దురుద్దేశాలు తగవు

తాళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరత ఉందంటూ వైసీపీ లేని పోని ప్రచారాలు చేస్తూ రైతులు ఆందోళన చెందేలా చేస్తోందని టీడీపీ నాయకులు వైసీపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో జరిగిన సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, మన్నేపల్లి సొసైటీ అధ్యక్షులు గొంది రమణారెడ్డి, రాచకొండ వెంకటరావు పాల్గొన్నారు.

ఇథనాల్ సాగు వల్ల ఉపాధి అవకాశాలు

వెలిగండ్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ సాగు వల్ల వ్యవసాయం, ప్రాసెసింగ్, పంపిణీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని డీఆర్వో ఓబులేసు చెప్పారు. ఆర్కేఎస్ టెక్నో విజన్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మండలంలోని మెగళ్లూరు గ్రామంలో 14 ఎకరాలలో చేపట్టనున్న ఇథనాల్ సాగుపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ ఎన్.వాసు పాల్గొన్నారు

పీసీపల్లిలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

పీసీపల్లి,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో భాగంగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పొగాకు వాడకాన్ని మానుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు లఘునాటికను ప్రదర్శించారు.

కేజీబీవీ పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ

సీఎస్‌పురం/పామూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల అవసరాలకు ఎస్‌ఐ వెంకటేశ్వర నాయక్ ఏడు సీలింగ్ ఫ్యాన్లను 10 చార్జింగ్ బల్బులను బుధవారం బహూకరించారు. ప్రిన్సిపాల్ షేక్ రేష్మ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎంపిక

కనిగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎంపిక బుధవారం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లోని డాక్టర్ గురుబ్రహ్మం ధ్యాన మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్‌ఎంవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించగా, ఎన్నికల అధికారిగా డాక్టర్ బీవీ సుబ్బారావు నిర్వహించారు. కనిగిరి ప్రాంతీయ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, నాగభూషణం ఎంపికయ్యారు. కార్యదర్శిగా నరసింహారావు, కోశాధికారిగా వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ గౌస్‌మొహిద్దీన్, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐదు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో బీ విశ్వరూపాచారి, రవీంద్రనాథ్‌రెడ్డి, రాజయ్య హాజరయ్యారు.

డిగ్రీ ఫలితాల్లో ఆల్ఫా విద్యార్థుల ప్రతిభ

కనిగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఆల్ఫా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు మేలైన ర్యాంకులు సాధించి సత్తా చాటారు. బీఎస్సీ మ్యాథ్స్‌లో బద్దల కళ్యాణి 9.46 శాతం మార్కులతో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకు సాధించింది. అదేవిధంగా బోటనీలో దిరిశినాల గీత 9.29 శాతం మార్కులతో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకు కైవసం చేసుకుంది. బీఓసీ అగ్రికల్చర్‌లో ముండ్లపాటి రిషికారాణి 8.67మార్కులు, గుండ్లతోటి హర్షిత 8.31 మార్కులు, బీఎస్సీ కంప్యూటర్స్‌లో కుంచాల ప్రశాంతి 9.14 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మాలకొండారెడ్డి, డైరెక్టర్ కరణం చెంచుబాబు అభినందించారు.

నిర్లక్ష్యం వహించిన పోలవరం లైన్‌మెన్ సస్పెన్షన్

ముండ్లమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలవరం ఎస్సీ కాలనీకి చెందిన నంబూరు పెదజక్రయ్య ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తూ ప్రమాదానికి గురై మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆ గ్రామ జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న బాలరాజుకు ఇంటి యజమానులు విద్యుత్ సరఫరాలో లోపం ఉందని పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో వృద్ధుడు మృతికి కారణంగా భావించి ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు విచారణకు ఆదేశించారు. దర్శి ఈఈ పాలగిరి శ్రీనివాసులు విచారణ చేపట్టారు. పెదజక్రయ్య మృతికి కారణంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు బాలరాజును సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.





పొగాకు కొనుగోళ్లలో గందరగోళం

- కారంచేడు రైతులకు తెనాలి షెడ్యూల్
- మార్క్‌ఫెడ్ అధికారుల వైఖరిపై నిరసన
- కొనకపోతే మీరే తగలబెట్టండని ఆగ్రహం

తెనాలి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యుల్ ప్రకారం వచ్చే రైతుల నుంచి ఒక్క ఆకు కూడా మిగలకుండా కొంటామని ప్రభుత్వం చెబుతుంది. కానీ మార్క్‌ఫెడ్ అధికారులు తీరు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కారంచేడు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో పొగాకు పండించిన రైతులకు వారి సరకు అమ్ముకునే అవకాశాన్ని తెనాలి మార్కెట్ యార్డుకు షెడ్యుల్ ఇచ్చారు. నాలుగు రోజులుగా పొగాకు బేళ్ల తీసు కొస్తుంటే, కొంతవరకు కొనుగోలు చేస్తున్నారని, చాలావరకు వంకలు పెడుతున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కారంచేడు రైతులు తెనాలి యార్డులో తమ సరకు కొనుగోలు చెయ్యాలంటూ నిరసనకు దిగారు. కొనకపోతే మీరే తగలబెట్టేయండంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులు కాకుండా, బయటివారు సరకు నాణ్యతను నిర్ధారిస్తున్నారని, వారికి ఇష్టమొచ్చిన వాటిని, సిఫార్సులున్న వాటిని కొంటున్నారని, లేనివారివి అసలు పట్టించుకోవడం లేదనేది రైతుల ఆరోపణ. నాసిరకంగా ఉన్నా క్వింటాకు రూ.6 వేలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా మార్క్‌ఫెడ్ అధికారులు అవేమీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత అధికారులు సరుకు పరీక్షించిన తర్వాతే ఎప్పుడు, ఏ కొనుగోలు కేంద్రానికి వెళ్లాలనేది నిర్ణయించి, షెడ్యూల్ ఇస్తున్నారని, దీంతో రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు చేసుకుని వస్తే అధికారులు తిప్పి పంపుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. పండించిన పంటకు రూపాయి రాకపోగా, మళ్లీ తిరిగి వెనక్కు తీసుకువెళ్లడానికి రెట్టింపు ఖర్చుపెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ ఎక్కువగా ఉన్న సరకు తీసుకొస్తున్నారని, పది రోజుల క్రితం అవగాహన కల్పించినా, వారు పాటించకుండా వస్తున్నారని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద పొగాకు కొనుగోలుకు సంబంధించి గందరగోళ వాతావరణం నెలకొంది.

కొనమని చెప్పడం లేదు

పొగాకు కొనుగోళ్లలో నాణ్యత నిర్ధారణకు ఐటీసీ సహకారం తీసుకున్నాం. వారు పరీక్షించి క్వాలిటీ నిర్ణయిస్తున్నారు. పైగా కొనలేమని ఎవరికీ చెప్పడం కానీ, తిప్పిపంపడం కానీ చేయడంలేదు. సరకు నాణ్యత లేకున్నా, తేమ శాతం ఎక్కువగా ఉన్నా, వాటిని కొని గోదాములో మంచి సరుకుతోపాటు నిల్వ ఉంచితే, వాటికి ఫంగస్ సోకుతుంది. దీని వల్ల మొత్తం పొగాకు నాశనమైపోతుంది. అందుకే తేమ తగ్గేవరకు ఆగి, తర్వాతే తీసుకురమ్మంటున్నాం.

- కరుణ, డీఎం, మార్క్‌ఫెడ్, బాపట్ల జిల్లా


కొనుగోలు చేయడం లేదంటూ ఆందోళన చేస్తున్న రైతులు

సున్నా వడ్డీ కలేనా?



స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొందే మహిళలపై రుణాల వడ్డీ భారం తప్పడం లేదు. రాయితీతో తమపై భారం తగ్గుతుందని ఆశించిన వారికి.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వడ్డీ మోత తప్పడం లేదు. ఎన్నికల హామీ మేరకు.. ప్రభుత్వం కొలువు దీరి 15 నెలలైనా.. ఇంత వరకు 'సున్నా వడ్డీ' ఊసే లేదు. బడ్జెట్ కేటా యింపుతో హడావుడి చేసినా.. ఆచరణ శూన్యం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీపై పిల్లి మొగ్గలు వేసి.. చివరి విడత వడ్డీ డబ్బులు చెల్లించలేదు.

- డ్వాక్రా సంఘాలకు తప్పని భారం
- పరిమితి తగ్గించిన గత ప్రభుత్వం
- 'ఆసరా'లోనూ మహిళలకు టోకరా..!
- కూటమి ప్రభుత్వంలో ఊసేలేని రాయితీ హామీ అమలు..

బాపట్ల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 74,640 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో ఏడు లక్షల మంది మహిళలు ఉన్నారు. బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్‌ను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య ఎనిమిది లక్షలకు పెరుగుతుంది. వీరు ఏటా స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.3 వేల కోట్ల మేర రుణాలు తీసుకుంటుంటారు. ఆయా కేటగిరీలను బట్టి 9 నుంచి 13.5 శాతం వరకూ వీరు బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏటా మూడు జిల్లాల్లో వీరిపై దాదాపు రూ.125 కోట్ల మేర వడ్డీ భారం పడుతోంది.

ఎన్నికల హామీ అమలుకు నోచుకునేనా?

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయం సహాయక సంఘాల మహిళలపై వడ్డీ భారం తగ్గిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల హామీ ఇచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పరిమితిని రూ.3 లక్షలకే పరిమితం చేసి మోసం చేసిందని, తాము రూ.10 లక్షలకు పెంచుతామని అట్టహాసంగా ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు పూర్తయింది. కానీ, మహిళలకు ఇచ్చిన సున్నా వడ్డీ హామీ మాత్రం అమలుకు నోచుకోలేదు.



● 'ఆసరా'లోనూ టోకరా..

2019 ఏప్రిల్ 11 నాటికంటే ముందు చెల్లించిన రుణాలకు కూడా వడ్డీని రీయింబర్సు చేస్తామని అప్పట్లో వైసీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక 'ఆసరా' పేరుతో నాలుగు విడతలుగా ఆ వడ్డీని తిరిగి (మిగతా 8వ పేజీలో)

గతంలో వంచించిన వైసీపీ ప్రభుత్వం..

వైఎస్సార్ సున్నా వడ్డీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం మహిళలకు వడ్డీ రాయితీ ఇస్తానని చెప్పింది. ఆచరణలో మహిళలను ఘోరంగా వంచించింది. 2014-19 మధ్య కాలంలో గ్రూపు రుణం రూ.5 లక్షల వరకూ వడ్డీ రాయితీ ఇవ్వగా, వైసీపీ సర్కార్ 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పేరుతో దాన్ని రూ.3 లక్షలకు పరిమితం చేసింది. దానికి కూడా అనేక షరతులు పెట్టింది. దీంతో అన్ని డ్వాక్రా సంఘాలు అంతకు ముందు ప్రభుత్వంలో కంటే అదనంగా వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. రూ.5 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న చాలా సంఘాలు సున్నా వడ్డీకి దూరం కావాల్సి వచ్చింది. ఫలితంగా మూడు జిల్లాల మహిళలపై రూ.110 కోట్ల వడ్డీ భారం పడింది.

సమర్ధవంతంగా స్త్రీశక్తి అమలు

మరికొన్ని బస్సుల్లో అమలుపై ఆలోచన ● ఎండీ ద్వారకా తిరుమలరావు

అద్దంకి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం(స్త్రీశక్తి పథకం) పక్క రాష్ట్రంలో కంటే మన రాష్ట్రంలో సమర్ధవంతంగా అమలు జరుగుతుందని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజ్‌లో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు,


ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎండీ ద్వారకాతిరుమలరావు

మహిళా ప్రయాణికుల సహకారంతో స్త్రీశక్తి పథకం ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 60 డిపోలలో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) వచ్చిందన్నారు. కొన్ని డిపోలలో అయితే 120 శాతం ఓఆర్ కూడా వచ్చిందన్నారు. మహిళా ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ వస్తుందన్నారు. కొన్ని సందర్భాలలో ఆధార్ కార్డు లేకపోయినా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని, దాని కోసం పట్టుబట్టాల్సిన అవసరం లేదన్నారు. ఒకరిద్దరు ఇతర రాష్ట్రాల ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించినంత మాత్రాన పెద్దగా వచ్చే నష్టమేమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణానికి అనుమతించే ఆలోచన చేస్తుందన్నారు. ఎక్కువ మంది మహిళా ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఉందన్నారు.


● నాయుడమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆర్థికవేత్త నాగరాజు, శాస్త్రవేత్త స్వర్ణ వికాంత్

గ్రామీణ ఆర్థిక వికాసంతోనే.. సుసంపన్న భారత్

తెనాలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక రంగంలోనూ శాస్త్ర, సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చామని, డిజిటల్ విధానం మన దేశ ఆర్థిక స్థితినే మార్చివేసిందని.. అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సేవల విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాల పేర్కొన్నారు. ప్రపంచ ఖ్యాతి పొందిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పురస్కార ప్రదాన కార్యక్రమం తెనాలిలో యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని కేంద్ర ఆర్థిక రంగ నిపుణుడు, ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజు, అలివేలు మంగతాయారు దంపతులకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదానోత్సవ సభలో తొలుత నాయుడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయుడమ్మ డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. నాయుడమ్మ పురస్కారాన్ని ఇప్పటి వరకు ఎందరో ప్రపంచ మేధావులు, గొప్పవారు అందుకున్నారని.. వారి సరసన తాను నిలవడం గర్వంగా ఉందని అవార్డు గ్రహీత నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు.

పరిశీలన ప్రహసనం

- కొలిక్కిరాని డీఎస్సీ సర్టిఫికెట్ల సమస్యలు
- కత్తి మీద సాములా ఈడబ్ల్యూఎస్ అర్హత గుర్తింపు
- దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల్లో రోజుకో కొత్త సమస్య

గుంటూరు(విద్య), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లలో వాస్తవమెంత.. దివ్యాంగుల ధ్రువీకరణలో అర్హత ఉందా.. వివాహమైనా భర్తల ప్రస్తావన లేకుండా తల్లిదండ్రుల ఆశ్రయంలో ఉన్నట్లు కొందరు దరఖాస్తులో చూపడం.. ఇలా అనేక సమస్యలతో మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఇంకా కొలిక్కిరాలేదు. ఒక సమస్య పరిష్కారం అయితే మరో సమస్య ఉత్పన్నం కావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల విషయంలో నెలకొన్న సమస్యలను అధికారులు క్రమంగా పరిష్కరించుకుంటూ వస్తుండగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్) అభ్యర్థుల విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. దీంతో అధికారులు వీటిపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారించిన తర్వాతనే ఈడబ్ల్యూఎస్‌కు అర్హత నిర్ధారిస్తున్నారు. మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమై ఇప్పటికే 10 రోజులు గడిచింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో దాదాపు 1600 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. వందమందికి పైగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వివిధ దశల్లో ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే సర్టిఫికెట్లలో అర్హతలకు సంబంధించి అనేక సమస్యలను అధికారులు గుర్తించారు. ఆయా సర్టిఫికెట్ల పరిశీలనలో సమస్యలు కొలిక్కి రాకపోవడంతో అధికారులు నిత్యం ఈ పనిలో తల మునకలవుతున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ అధికారులకు కత్తిమీదసాములా మారింది. దాదాపు 23కి పైగా బృందాలు సర్టిఫికెట్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా రాష్ట్రస్థాయిలో సమస్యలు వస్తాయని అత్యంత ఖచ్చితత్వంతో పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 17 లోగా పరిశీలన ప్రక్రియను ముగించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఈడబ్ల్యూఎస్ అర్హతపై అనుమానాలు..

మెగా డీఎస్సీలో కొంతమంది మహిళా అభ్యర్థులు భర్తలు ఉద్యోగం చేస్తున్నా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పెట్టినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఇటువంటివారు కనీసం పదిమందికిపైగా ఉన్నట్లు సమాచారం. మహిళలకు వివాహం కాకుండా ఉన్నప్పుడే తల్లిదండ్రులకు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఇద్దరు మహిళల భర్తల్లో ఒకరు కానిస్టేబుల్ కాగా, మరొకరు సచివాలయ ఉద్యోగి. వారి భర్తల వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపే కావడంతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద సదరు మహిళలని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరికొంత మహిళలు తమ భర్తలు వ్యాపారాలు చేస్తూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో డీఎస్సీకి అర్హత సాధించారు. అయితే వారి భర్తలు ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే వీరు (మిగతా 8వ పేజీలో)


డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొన్న అభ్యర్థులు

కాంట్రాక్టర్ల టోకరా

- నిధులు దోచుకుని నిర్మాణాలు మరిచారు
- 29,168 ఇళ్లకు 30 శాతం కూడా పూర్తికాని వైనం

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్నకాలనీల కాంట్రాక్టర్లు నిధుల దోపిడీతో సరిపెట్టారు. గతంలో అధికార పార్టీ అండదండలతో ఇబ్బడి ముబ్బడిగా గృహ నిర్మాణాలకు సంబంధించిన కాంట్రాక్టులను చేజిక్కించుకున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.30 వేలు లబ్ధిదారులకు మంజూరు చేసింది. ఈ ప్రకారం జిల్లా వ్యాప్తంగా జగనన్నకాలనీల్లోని లేఅవుట్లలో 29,168 నివాసాలు మంజూరు జరిగాయి. చీరాల నియోజకవర్గంలో 3502, అద్దంకిలో 6668, రేపల్లెలో 2462, బాపట్లలో 3948, పర్చూరులో 3422, వేమూరు నియోజకవర్గంలో 9166 ఇళ్లు మంజూరు జరిగాయి. అయితే లబ్ధిదారులు అప్పటి పాలకుల మాటలు విని కాంట్రాక్టర్లకు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. అయితే ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని దాదాపుగా మూడు దశలకు సంబంధించిన నగదు దాదాపుగా ఒక్కో ఇంటికి రూ.1.20 లక్షలు వరకు దోచుకున్న కాంట్రాక్టర్లు లబ్ధిదారులకు అడ్డం తిరిగారు. చేపట్టిన నిర్మాణాల్లో దాదాపుగా 30 శాతం వరకే పూర్తి జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అసలే చాలీచాలని నగదుతో ఇల్లు ఎలా పూర్తి చేసుకోవాలో అంతు చిక్కని లబ్ధిదారులను కాంట్రాక్టర్లు టోకరా పెట్టడంతో ఇప్పుడు అయోమయంలో ఉన్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇళ్లు అర్ధాంతరంగా ఆగిపోయి కనిపిస్తున్నాయి. పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేసిన రూ.50 వేలు కూడా చాలా చోట్ల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో అధికారులు రంగంలోకి దిగారు. దీంతో తమ దోపిడీ ఎక్కడ బహిర్గతమవుతుందోనని పలువురు కాంట్రాక్టర్లు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.


చీరాల జగనన్న కాలనీ

బాపట్లకు నేడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- ఉపముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సూర్యలంక రోడ్డులోని నగరవనం ముస్తాబు
- తీర ప్రాంత రక్షణకు గ్రీన్‌వాల్ ఏర్పాటుకు ప్రణాళికలు
- అమరులైన 23 మంది అటవీ అధికారుల కుటుంబీకులతో భేటీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన, జనసేన నేతలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జాతీయ అటవీ అమరవీరుల దినం సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం బాపట్లలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్‌కల్యాణ్ తొలిసారి బాపట్లకు రానుండడంతో అధికారులు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేస్తున్నారు. పవన్ రాక కోసం జనసేన శ్రేణులు కూడా పెద్దసంఖ్యలో ఎదురు చూస్తున్నారు. పవన్‌కల్యాణ్ కోసం సూర్యలంక తీరాన్ని ముస్తాబు చేశారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 9:15కు పవన్ చేరుకోనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో సూర్యలంకతీరం చప్టా సమీపంలో రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన తాటి మొక్కలు నాటి గ్రీన్‌వాల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తీరప్రాంత భద్రతకు రక్షణ కవచంగా ఉండేలా గ్రీన్‌వాల్ ఏర్పాటు ఆవశ్యకతపై ఆయా విభాగాల అధికారులతో చర్చించనున్నారు. నగరవనంలో అటవీ అమరవీరుల దినోత్సవంలో పాల్గొంటారు. సూర్యలంక రోడ్డులోని నగరవనంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల స్థూపాన్ని డిప్యూటీ సీఎం ఆవిష్కరించనున్నారు. అటవీ సంపదను కాపాడే క్రమంలో విధి నిర్వహణలో రాష్ట్రవ్యాప్తంగా అమరులైన 23 మంది కుటుంబాలతో పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా సమావేశం కానున్నారు. వారికి ఆర్థిక సాయం కూడా అందించనున్నారు. డ్వామా, అటవీ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను డిప్యూటీ సీఎం తిలకించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జనసేన నాయకులు ఉన్నారు. పవన్ పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ ట్రయల్‌రన్ కూడా బుధవారం సాయంత్రం జరిగింది. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది సంయమనంతో వ్యవహరిస్తూ సమర్ధంగా విధులు నిర్వహించాలని ఎస్పీ తుషార్‌డూడి ఆదేశించారు. ఎస్పీ నిర్వహించిన సమావేశంలో డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎండీ మొయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది త్యాగాలు గుర్తుచేసుకునేందుకు..

ప్రతి ఏడాది సెప్టెంబరు 11న జాతీయ అటవీ అమరవీరుల దినాన్ని నిర్వహిస్తారు. ఖేజ్రీ చెట్లను రక్షించడానికి బిష్ణోయ్ తెగవారు చేసిన చారిత్రాత్మక త్యాగానికి చిహ్నంగా సెప్టెంబరు 11కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అటవీ సిబ్బంది త్యాగాలను గుర్తు చేసుకుని వారికి డిప్యూటీ సీఎం పవన్ నివాళులు అర్పించనున్నారు.


పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణతేజ, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే వేగేశన






పెద్ద అండరుపాస్ వద్ద ఏర్పడిన పెద్ద గుంత, సర్వీసురోడ్డు మలుపులో నిలిచిన నీరు, దుకాణాల వారు పగులగొట్టిన సర్వీసురోడ్డు, వంతెన మలుపులో ప్రమాదభరితంగా ఉన్న గుంతలో నిలిచిన నీరు

మార్టూరు కూడలిలో రోడ్లపై గుంతలు

- రోడ్డుపై నిలుస్తున్న మురుగునీరు
- వాహనదారులకు కనిపించని ప్రమాదాలు
- సర్వీసురోడ్డును ధ్వంసం చేసి డ్రైనేజీ లైన్లు
- పట్టించుకోని హైవే అధికారులు

మార్టూరు, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి):చెన్నై టూ కోల్‌కత్తా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మార్టూరు సెంటర్లోని జాతీయరహదారిని విస్తరించారు. ఫ్లైఓవర్ కూడా నిర్మించడంతో వాహనచోదకుల అవస్థలు తప్పాయనడంతో అతిశయోక్తి కాదు. అయితే నిర్వహణ లేమితో పలు సమస్యలు వాహనదారుల భద్రతను ప్రమాదంలోనికి నెడుతున్నాయి.

మార్టూరులో పెద్ద ఖానా వద్ద గోతులు ఏర్పడ్డాయి. అంతేగాకుండా .ఈ గుంతలు కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఒక మోస్తరు వర్షం కురిసినా పెద్ద ఖానా వద్ద నీరు నిల్వ ఉంటోంది. దీంతో ఈ నీటిలో ఎక్క గుంత ఉందో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ నీటిలో వాహనాలు నడిపి ఒక్కసారిగా గోతుల్లో పడి ప్రమాదాలబారిన పడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా స్కూటీలపై వెళ్లే, మహిళలు, విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఇక పాదచారులైతే వర్షం కురిసినప్పుడు నడిచివెళ్లే పరిస్థితి కూడా లేదు. విద్యానగర్ ముందు జాతీయ రహదారిపై వర్షం కురిసినప్పుడు పెద్దపెద్ద నీటిమడుగులు ఎర్పడుతున్నాయి. అక్కడ మురుగునీరు వెళ్లే దారిలేదు, వర్షం కురిస్తే వాననీరు రోడ్లపైనే భారీగా నిలుస్తోంది. హైవే అధికారులు వాటిని గురించి పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

సర్వీసురోడ్లు పగలగొడుతున్నారు

మార్టూరు సెంటర్లో ఫ్లైఓవర్‌కు తూర్పు వైపున హైవే అధికారులుగాని, గ్రామ పంచాయతీ వారు గాని సైడు కాల్వలు నిర్మించలేదు. దీంతో తూర్పువైపున దుకాణాలు వారు, ఇంటి యజమానులు వారి దగ్గర నుండి వచ్చే మురుగునీరు, వృథానీటిని బయటకు పంపడానికి సర్వీసురోడ్డును పగలగొట్టి ఫ్లైఓవర్ గోడవైపు మళ్లించారు. ఇక ఫ్లైఓవర్‌కు పడమర వైపు ఉన్న చికెన్ దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు కూడా సర్వీసురోడుడ పగొలగొట్టి ఫ్లైఓవర్ గోడ వెంబడి ఉన్న డ్రైనేజీలోనికి నీటిని పంపుతున్నారు. దీని కోసం నేరుగా రోడ్డుకు గాడి కొడుతుండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డుపై నిలుస్తున్న వర్షపునీరు

హీరోషోరూం ఎదురుగా సర్వీసు రోడ్డు నుంచి హైవే పైకి వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద భారీగా మురుగునీరు నిలుస్తోంది. ఈ నీరు నిలిచిన స్థానంలో భారీగా గోతులు కూడా ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహనదారులు రోడ్డు క్రాస్ చేసే సమయంలో ఈ గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఒక సారి హైవే అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసినా, సమస్యకు పరిష్కారం చూపలేదు. అయితే ఈ మలుపు వద్ద ఒంగోలు వైపు వెళ్లే ప్రయాణికులు బస్సులు కోసం వేచి ఉంటారు. వివిధ వాహనాలు అటువైపు వెళ్లే క్రమంలో మురుగునీరు చిమ్మి వారిపై పడుతోంది.

రోడ్లపై మరమ్మతులు చేస్తాం

గతంలో ఒక సారి రోడ్లపై మరమ్మత్తులు చేశాం. మరల పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి గుంతలను పూడ్చివేస్తాం. రోడ్లపై మురుగునీరు నిలబడకుండా చర్యలు చేపడతాం.

బ్రహ్మారెడ్డి హైవే అధికారి

అవీ..ఇవీ..

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం

- జయప్రదం చేయాలని ఆ సంఘం నేతలు పిలుపు

పంగులూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్) జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల చెంచురామారావు, కంకణాల శ్రీనివాసరావు బుధవారం సంయుక్త ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులందరు ఐక్యంగా ఈ నిరసన వారాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. నిరసన వారంలో భాగంగా గురువారం ఉపాధ్యాయులందరూ నల్లబాడ్జీలు ధరించి హాజరుకావాలని ఆ సంఘం మండలశాఖ అధ్యక్ష,కార్యదర్శులు తన్నీరు వెంకటరావు, షేక్ రహంతుల్లాలు విజ్ఞప్తిచేశారు.

నేడు గ్రోమోర్‌లో యూరియా పంపిణీ

మార్టూరు, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): మార్టూరులోని గ్రోమోర్ సెంటర్‌లో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేస్తారని ఏవో ఆర్ లావణ్య బుధవారం తెలిపారు. ఆమె బుధవారం మండలంలోని కోనంకి, వలపర్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కలిగించారు. అంతేగాకుండా నానో యూరియా వినియోగం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అయితే గురువారం గ్రోమోర్ కార్యాలయం వద్ద ఈ-పంటను నమోదుచేసుకున్న రైతులకు అవసరమైన వారికి ఎకరాకు ఒక బస్తా యూరియాను పంపిణీ చేస్తామన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు సుస్థిర జీవనోపాధి

- మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ ఆనంద్ సత్యపాల్

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి పెంపొందించే విధంగా సిబ్బంది కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ ఆనంద్ సత్యపాల్ అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీడీ బుధవారం చీరాల మెప్మా కార్యాలయంలో మేనేజర్ కొండయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంపిక చేసిన 220 మంది మహిళ లబ్ధిదారులతో యూనిట్లు ఏర్పాటు చేయించాలన్నారు. అలాగే డిజిటల్ సేవల ఏర్పాటు కోసం డిజీలక్ష్మీలతో కియోస్క్ సెంటర్లు నిర్వహించాలని చెప్పారు. సూర్యఘర్, ర్యాపిడో ఆటోలు, బైక్‌ల రుణాలకు సంబంధించి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీవోలు రత్నకుమారి, సుబ్బారావు, శేషారత్నం, సతీష్, డీఈవో అనీల్, ఆర్పీలు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో విద్యార్థులకు ఆరోగ్యం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు ఐ.బాబురావు పేర్కొన్నారు. బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది విద్యార్థులకు దంత పరీక్షలు, గుండె తదితర పరీక్షలు నిర్వహించారు. అలాగే రూ.15 వేలు విలువైన బ్రష్‌లు, పేస్టు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.రవితేజ్, అబ్రహం, బ్లెస్సీ ప్రత్యూష, మేఘసాయి పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సాల్మన్, క్లబ్ ప్రతినిధులు కృష్ణమూర్తి, రామకృష్ణ, సురేష్, వెంకటేశ్వరరావు, శివాంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి తాటి చెట్లు దగ్ధం

చినగంజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో చినగంజాం మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపల్లెపాలెం గ్రామానికి సమీపంలోని కొక్కిలిగడ్డ రాజారావుకు చెందిన పొలంలోని తాటి చెట్లపై పిడుగు పడింది. దీంతో పొలంలోని పది తాటి చెట్లు దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. భారీ వర్షంతో పలు గ్రామాల్లోని రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కడవకుదురు గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు బయటకు మార్గం లేక నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని పాదచారులు, వాహనాదారులు అంటున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చినగంజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన నంబూరి శివమ్మ(65) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. సోపిరాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తుమ్మలపెంట శ్రీనివాసరావు బుధవారం శివమ్మ స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు శివమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

న్యాయవాదులపై అక్రమ కేసులు అన్యాయం



విధులను బహిష్కరించి నిరసన చేపట్టిన న్యాయవాదులు

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులపై అక్రమ కేసులు అన్యాయమని, నిరంతరం బాధితుల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారం కోసం న్యాయవాదులు పోరాడతారని చీరాల న్యాయవాదులు పేర్కొన్నారు. ఇటీవల రాజకీయ నేత గుంటూరు మాధవరావుపై న్యాయవాది ఆకుల కొండయ్య దాడిచేసినట్లు జె.పంగులూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి నిరసనగా బుధవారం పలువురున్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఉద్దేశ్య పూర్వకంగా కేసులు మోపి అబాసు పాలు చేయడం తగదన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

27న కూచిపూడి, భరతనాట్యం పోటీలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్పందన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న స్థానిక శింగరకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో బాలికలకు కూచిపూడి, భరతనాట్యం పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కూకట్ల సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుండి 6 సంవత్సరాల వారిని ఒక గ్రూపుగా, వారికి ప్రోత్సాహక బహుమతులు, వయస్సుల వారిగా మరో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.4వేలు, రూ.3 వేలు, రూ.2వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు ఒకొక్కరికి రూ.300 చెల్లించి ఈ నెల 26వ తేదిలోపు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత ప్రదర్శన మాత్రమనే నని, సినిమా పాఠశాలకు అనుమతి లేదన్నారు. పూర్తి వివరాలకు 94409 74064 నంబరును సంప్రదించాలన్నారు.

కనకయ్య సేవలు చిరస్మరణీయం

మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్



కనకయ్య స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

పర్చూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పౌరహక్కుల నేత క్రిష్ణంశెట్టి కనకయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్ అన్నారు. కనకయ్య 10వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక బాలికల పాఠశాలలో రాష్ట్ర కళాకారులు కారుమూరి సీతారామయ్య అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరిప్రసాద్ మాట్లాడుతూ బాలికల విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న సంకల్పంతో పర్చూరులో పాఠశాలను ఏర్పాటు చేసి దాతలు, కుటుంబ సభ్యుల సహకారంతో 30 ఏళ్లగా నిర్వహించడం ఆయన సేవకు నిదర్శనం అన్నారు. క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పౌరహక్కుల నేతగా, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన తీరు చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో క్రిష్ణంశెట్టి అజయ్‌బాబు, కోటి క్రాంతి శ్రీనివాస్, ఆరాధ్యుల శాంతి, వెంకటేశ్వరరావు, కాసా అశోక్‌కుమార్, క్రిష్ణంశెట్టి బసవరాజు, క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- నిర్మాణాలను పరిశీలించిన మహేంద్రనాథ్



తీరంలో పర్యటిస్తున్న మహేంద్రనాథ్

చీరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో తీరానికి వచ్చే పర్యాటకుల సౌకర్యాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో గతకొద్ది రోజులుగా రామాపురం, వాడరేవు తీర ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ పనులను పరిశీలించారు. పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణాలు వేగవంతంగా జరగాలని చెప్పారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నక్కల నాగరాజు, తదితరులు ఉన్నారు.

పర్చూరులో భారీ వర్షం

జలమయమైన రహదారులు

లోతట్టు నివాసాల్లోకి వర్షపు నీరు

పర్చూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో బుధవారం కురిసిన భారీ వర్షానికి రహదారులు జమమయం అయ్యాయి. రోడ్లపై పెద్ద ఎత్తున నీరు చేరటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పర్చూరులో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, కాలవలపై కట్టడాలు నిర్మించు కోవడంతో నీరు ముందుకు కదలని విధంగా తయారైంది. ఎక్కడ చూసినా డ్రైనేజ్ కాలువ లను యధేచ్ఛగా ఆక్రమించుకొని వ్యాపార దుకాణాలను కొనసాగిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకో వచ్చు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీటితో మరు గునీరు కలసి రోడ్లపై చేరు తుంది. భారీ వర్షం కురిసిన ప్పుడు నివాసాల్లోకి నీరు చేరా ల్సిందే అన్నవిధంగా పరిస్థితి నెలకొంది. పర్చూరు - చీరాల రోడ్డుతోపాటు, కొట్లబజారు పరిస్థితి మరింత దయనీయం గా మారింది. బుధవారం కురిసిన భారీ వర్షంతో రోడ్లు వాగులను తలపించే విధంగా మారాయి.



బురదమయమైన పర్చూరు - చీరాల రోడ్డు



పర్చూరు కొట్లబజారులో నివాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు

డిగ్రీ విద్యార్థులతో రోటరాక్టు క్లబ్ ఏర్పాటు



రోటరాక్టు క్లబ్ సభ్యులతో రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో బుధవారం 20 మంది డిగ్రీ విద్యార్థులతో రొటరాక్టు క్లబ్‌ను ఏర్పాటు చేశారు. రొటరాక్టు క్లబ్ అధ్యక్షుడిగా తన్నీరు రాకేష్, సెక్రటరీగా తిరునగరు హేమంత్‌లను నియమించారు. రోటరీ క్లబ్ సమాజ సేవలలో ఏవిధంగా ఉపయోగపడుతుందో అదేవిధంగా రొటారాక్టు క్లబ్ కూడా రోటరీ క్లబ్‌తో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అలహరి హరిప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ పోపూరి ఎల్వీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకికి అధునాతన బస్టాండ్

ఆర్‌టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



ఎక్కువ ఆదాయం తీసుకు వచ్చిన కండక్టర్‌ను అభినందిస్తున్న ఎండీ

అద్దంకి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండుమూడేళ్లలో అద్దంకిలో అధునాతన బస్టాండ్ నిర్మించనున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు అన్నారు. అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీలను బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ముందుగా బస్టాండ్ ప్రాంగణంలో మొక్కను నాటారు. కార్మికులతో మాట్లాడి, పలు విభాగాలలో ఉత్తమ కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకిలో ప్రస్తుతం ఉన్న దుకాణాల వలన మంచి ఆదాయం వస్తోందన్నారు. విశాలమైన స్థలం ఉన్నందున ముందు వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వెనుక వైపు ఆధునాతన వసతులతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆర్టీసీ ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. స్త్రీశక్తి పథకం అమలులో పక్కరాష్ట్రంలో వివిధ సమస్యలు ఉత్పన్నం కాగా, మనరాష్ట్రంలో విజయవంతమైందన్నారు. గతంలో ఆర్టీసీ బస్సులలో 40 శాతం మంది మహిళలు ప్రయాణిస్తుండగా ప్రస్తుతం 65 శాతానికి చేరినట్లు తెలిపారు. మరిన్ని బస్సులలో మహిళాశక్తి పథకం అమలుచేసేలా సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోనున్నారన్నారు. ప్రయాణికులు సంఖ్య పెరిగినందున అన్ని బస్టాండ్ లలో వసతులు పెంచుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 2550 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకే ఉన్న బస్సులనే ఎక్కువ ట్రిప్పులు తిప్పేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. బస్సుల మెయింటినెన్స్ కూడా పెంచుతున్నామన్నారు. వ్యయం తగ్గించడంతో పాటు నాన్‌టికెట్ ఆదాయం పెంచేందుకు కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందుతుందన్నారు. ఇప్పటికే మెరుగైన వైద్య వసతులు కల్పించి 1200 మంది కార్మికుల ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగి బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. ఆయిల్ ఎక్కువ ఖర్చు అవుతుందని అద్దె బస్సుల యజమానులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు ఎండీ ద్వారకాతిరుమలరావును సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఈడీ (ఆపరేషన్స్) అప్పలరాజు, నెల్లూరు ఈడీ నాగేంద్ర ప్రసాద్, డీపీటీవో సామ్రాజ్యం, సీటీఎం రవికాంత్, డీఎం బెల్లం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి తదితరులు పాల్గొన్నారు.

అనిత సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శం

- డిప్యూటీ డీఈవో గంగాధర్



అనితకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

పంగులూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సేవాభావంతో పనిచేస్తూ, ఉత్తమ బోధనతో పాఠశాల విద్యార్థుల భవితను తీర్చిదిద్దుతున్న హెచ్‌ఎం అనిత సేవలు ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని చీరాల డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన కొండమంజులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనిత అభినందన సభ బుధవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూటుతున్నారన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనితను గంగాధర్‌తో పాటు ఎంఈవోలు నాగభూషణం, వీరాంజనేయులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చింతల సహదేవుడు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రామగోపాలరెడ్డి, ఆరె శ్రీనివాసరావు, పలువురు గ్రామస్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అభినందనీయం

టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య

చినగంజాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, సంతరావూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మీలు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు మార్పు విశ్రాంతమ్మ అధ్యక్షతన బుధవారం దివ్యాంగులు, పీ4 లబ్దిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దాత సోపిరాల గ్రామానికి చెందిన టీఎన్‌టీయూసీ పర్చూరు నియోజకవర్గ అధ్యక్షులు నరహరి శ్రీనివాసరావు రూ.25 వేల విలువైన నిత్యావసర సరుకులను 40 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. పీ4 కింద 22 మందిని గుర్తించి, మిగిలిన 18 మందిని దివ్యాంగుల గ్రూపులో వారిని కలిపి 40 మందికి నిత్యావస రాలను అందజేసినట్లు ఏపీఎం గద్దె పెద సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు అబ్దుల్‌కలాంఅజాద్, టీ.జయరావు, నందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, పర్వతరెడ్డి పార్థసారిధి, గంటా వెంకటనారాయణ, షేక్ హుస్సేన్‌బాష, తొగరు దుర్గారావు, పీ.లక్ష్మీనారాయణ, గుండ్రెడ్డి నరసింహారావు, షేక్.ఖాదర్‌బాష, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

- బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

పర్చూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జీఎస్టీ విధానాన్ని హర్షిస్తూ బీజేపీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా ఆధ్వర్యంలో బుధవారం పర్చూరు బొమ్మల కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు పన్నుభారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సూచనల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు కొండముది బంగారుబాబు, అమీన్ బాషా, అడపాల కృష్ణ, మర్రిపూడి శ్రీనివాసరావు, రంగబాబు, శ్రీనివాసరావు, స్థానిక మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశీలన ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

ఈడబ్ల్యూఎస్‌కి ఎలా అర్హత పొందుతారనే సమస్య వచ్చింది. దీంతో ఐటీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారంతో అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారు దాదాపు 100 మందికి పైగా ఉన్నారు. వీరు ఈడబ్ల్యూఎస్‌కు అర్హులా కాదా అనే తేల్చే పని అధికారులకు కత్తి మీదసాములా మారింది.

నాలుగైదు దఫాలుగా..

దివ్యాంగుల విషయానికి వస్తే కొన్ని సమస్యలు కొలిక్కిరాలేదు. ప్రధానంగా వినికిడి సమస్యతో సర్టిఫికెట్లు పొందిన వారు వాటిని నిర్ధారించుకోలేక పోతున్నారు. దీంతో వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు మళ్లీ పిలవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన ఇప్పటికే నాలుగైదు దఫాలుగా నిర్వహించారు. అయినా ఇంకా మరో పది మంది సర్టిఫికెట్లను నిర్ధారించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించుకుంటూ నిర్దేశించిన నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు.

సున్నా వడ్డీ కలేనా?

(5వ పేజీ తరువాయి)

ఇస్తానని చెప్పింది. కానీ, పథకాన్ని 15 నెలలు ఆలస్యంగా ప్రారంభించి కాల హరణం చేసింది. రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న, మూడో విడత రుణ మాఫీని ఆరు నెలల ఆలస్యంగా 2023 మార్చి 25న ప్రారంభించారు. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ నాలుగో విడత ఆసరాని ఆపేసి మూడు జిల్లాల్లోని డ్వాక్రా మహిళలకు రూ.699 కోట్లు ఎగవేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్ డీఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2.86 లక్షల మందికి రూ.246 కోట్లు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి ఆసరా కింద రూ. రూ.190 కోట్లు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపులకు గాను.. మూడు లక్షల మం దికి రూ. 263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ జరగాల్సి ఉంది. దాన్ని గత ప్రభుత్వం ఎగవేయడం తో ఆ భారాన్ని మహిళలే మోయాల్సి వస్తోంది. దీనికి తోడు గడిచిన 15 నెలల వడ్డీ కూడా వారిపై పడడంతో స్వయం సహాయక సంఘాల మహిళల కు అనాసక్తికి గురవుతున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 11 సెప్టెంబరు 2025



అన్నదాత కష్టంతో 'బంతా'ట!

దిగజారిన పూల ధర

కడుపు మండి పారబోసిన కర్షకుడు

కర్షకుల కష్టంతో ధరలు 'బంతా'ట ఆడుతున్నాయి. మార్కెట్‌లో అడిగేవారు లేకపోవడంతో కోసిన పూలను ట్రాక్టర్లతో తోటల నుంచి బయటకు తీసుకొచ్చి రోడ్డు పక్కన పారబోస్తున్నారు. ధర లేకపోవడంతో కలువాయి మండలం కొలవపల్లిలో బుధవారం నాలుగు ట్రాక్టర్ల బంతిపూలను నేలపాలు చేశారు. వినాయకచవితి పండుగ సమయంలో కేజీ రూ.50 నుంచి 60 పలికిన పూలు ఇప్పుడు రూ.5లకు దిగజారింది. ఆ రేటుకు కూడా మార్కెట్‌లో వ్యాపారులు అడగని పరిస్థితి. దీంతో రైతులు కూలీల ద్వారా పూలను కోసి రోడ్డు పక్కన పారబోస్తున్నరు. కోతకు వచ్చిన పూలను కోస్తేనే తరువాత కోతలు వస్తాయని, వదిలేస్తే పైరు దెబ్బతింటుందని రైతులు తెలిపారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీరా పూల దిగుబడి వచ్చే సమయానికి మార్కెట్‌లో రేటు పతనం కావడం తమను కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

కోతలు మొదలైనా

ఒక్క ప్రభుత్వ కొనుగోలు కేంద్రమూ లేదు!

అనుమతుల పేరుతో చేతులెత్తేసిన యంత్రాంగం

తూకాలు ఏవీ!?

- భారీగా తగ్గిపోయిన ధాన్యం ధరలు
- పుట్టి ధాన్యం రూ.17 వేలకు మించని పరిస్థితి
- ఒక్కో పుట్టికి రూ.3-4 వేలు నష్టపోతున్న రైతులు

ఇందుకూరుపేట మండలం జంగందొరువు గ్రామానికి చెందిన రైతు పోతురాజు రమేష్ 13 ఎకరాల్లో సన్నాలు రకం సాగు చేశారు. ఎకరాకు రెండున్నర పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. మద్దతు ధరకు అమ్ముకుందామంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేవు. దీంతో ఒక్కో పుట్టిని రూ.16 వేలకు దళారులు కొనుగోలు చేశారు. గత సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పుట్టి రూ.20 వేలు చొప్పున అమ్ముకోగా, ఈ దఫా ఒక్కో పుట్టికి రూ.4 వేలు నష్టపోవాల్సి వచ్చిందని రైతు రమేష్ వాపోయారు.

అల్లూరుకు చెందిన మరో రైతు పవన్‌కుమార్ తనకున్న ఐదెకరాల్లో రెండో పంట సాగు చేశారు. మార్కెట్లో దళారులు సిండికేట్‌గా మారి పుట్టి ధాన్యాన్ని రూ.17 వేలకు మించి కొనుగోలు చేయలేదు. నిల్వ చేసుకునే అవకాశం లేక తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్మేశారు. కనీస మద్దతు ధర కూడా దొరకడం లేదని వాపోయారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు దోచుకుంటున్నారని రైతు పవన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



అల్లూరులో ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

వీరే కాదు.. దాదాపు రెండో పంట సాగు చేసిన అందరి రైతుల పరిస్థితీ ఇదే. గతేడాది ప్రభుత్వం ముందుచూపుతో సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటిని జాగ్రత్త చేయడంతో ఈదఫా రికార్డు స్థాయి విస్తీర్ణంలో రెండో పంట సాగు జరిగింది. అయితే ఎడగారులో కూడా పంట వేసుకున్నామన్న సంతోషం రైతులకు చివరి వరకూ మిగిలకుండానే పోతోంది. అందుకు ప్రధాన కారణం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే. వరి కోతలు ప్రారంభమై రెండు వారాలు గడిచినా ఇంత వరకు ఒక కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. ఈ నెలాఖరుకు కోతలు పూర్తవుతాయి. అయితే అధికారుల తీరు చూస్తుంటే ఈదఫా అసలు గింజ ధాన్యం కొనకుండానే మమ అనిపించేద్దాం అన్న ధోరణి కనిపిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. కోతలకు వారం ముందు నుంచే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిపై రైతులకు అవగాహన కల్పించాల్సింది పోయి ఇప్పటికీ ఆ ఊసే ఎత్తకపోతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రభావం రైతాంగంపై పడుతోంది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులంతా సిండికేట్‌గా మారి అమాంతం ధరలు తగ్గించేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేకపోవడం రైతాంగాన్ని తీవ్రంగా కలచి వేస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర పుట్టి ధాన్యానికి రూ.19720 ఉండగా, ప్రస్తుతం మార్కెట్లో గరిష్ఠంగా రూ.17 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని రైతుల ద్వారా తెలుస్తోంది. కొన్నిచోట్ల రూ.16 వేలకే కొంటున్నారు. ఇలా ఒక్కో పుట్టికి రైతు రూ.3 వేల నుంచి 4 వేల వరకూ నష్టపోతున్నారు.

ఎవరికీ పట్టదా!?

ఈ ఏడాది రెండో పంట కింద దాదాపు మూడు లక్షల ఎకరాల్లో సాగు జరగ్గా, 7 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అందులో మూడు లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టుగా చర్యలు మాత్రం తీసుకోలేకపోయారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి చేతులెత్తే శారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోతే మార్కెట్లో దళారులు ధర తగ్గించేస్తారన్నది బహిరంగ రహస్యం. అయినా ముందుగా అప్రమత్తం కాలేకపోయారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు కూడా జోక్యం చేసుకోకపోవడం గమనార్హం. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ధాన్యం ధరలు మరింత పడిపోయే ప్రమాదం ఉంది.

అన్నదాతలో అల'జడి'!

- వర్షానికి తడిసిన ధాన్యం
- కాపాడుకునేందుకు అవస్థలు

దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాపై ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి అడపాదడపా కురిసిన వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అయితే, ఈ వర్షం రైతులకు మాత్రం కష్టాలను తెచ్చి పెడుతోంది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు, కోసి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. బుచ్చి పరిసర ప్రాంతంలో సాయంత్రం 4 గంటల నుంచే ఆకాశం మేఘావృతం అవుతుండటంతో రైతులు అప్రమత్తమై ధాన్యం రాశులపై పట్టలు కప్పుకుంటూ కనిపించారు. ధాన్యాన్ని కింద పోయలేక వరికోత యంత్రం, ట్రాక్టర్లలోనే భద్రపరుచుకున్నారు. ఏపుగా పెరిగిన వరిపైరు తడితో బరువై భూమిమీద వాలిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే మిల్లర్లను ఆశ్రయించి అడిగినకాడికి అమ్ముకోక తప్పలేదు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



పెనుబల్లి వద్ద నేలవాలిన వరిపైరు



జొన్నవాడ వద్ద ధాన్యం అమ్ముకుంటున్న సమయంలో వర్షం రావడంతో రాశులపై పట్టలు కప్పిన రైతులు

కదిలొచ్చిన పోలేరమ్మ!

- వైభవంగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపు
- నేటి వెంకటగిరి జాతరకు సర్వం సిద్ధం



పుట్టినిళ్లు కుమ్మరి ఇంటి వద్ద భక్తులకు దర్శనం కల్పిస్తున్న పోలేరమ్మ అమ్మవారు

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుట్టిల్లయిన కుమ్మరి ఇంట బుధవారం రాత్రి రూపుదిద్దుకున్న పోలేరమ్మ ఊరేగింపుగా కదిలొచ్చారు. జాతర సందర్భంగా గురువారం భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఆలయం వద్ద కొలువు దీరనున్నారు. వెంకటగిరి జాతరలో భాగంగా బుధవారం పోలేరమ్మ పుట్టినింట అమ్మవారి పీఠానికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు పీఠంపై అమ్మవారి ప్రతిమను (కళ్లు, దిష్టి చుక్క లేకుండా) తయారు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పుట్టినింట కొలువుదీరిన అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలకు సప్పరంపై అమ్మవారిని అధిష్ఠింపచేసి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటకు తీసుకొచ్చారు. ఇక్కడ ఆచార సంప్రదాయాలతో అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క ఏర్పాటు చేసి పూర్తి అలంకారం చేశారు. అక్కడ్నుంచి దివిటీల వెలుగుల్లో ఆసాదుల తప్పెట్లు, యువత చిందులు, కేరింతల నడుమ అమ్మవారి ఊరేగింపు మొదలైంది. ప్రతి ఇంటి ముంగిట అమ్మవారికి కోళ్లు, మేకలను బలిచ్చారు. దీంతో పట్టణంలోని రోడ్లు ఎర్రగా మారాయి. అలా.. ఊరేగింపుగా అమ్మవారు గురువారం తెల్లవారుజామునకు ఆలయం వద్ద వేప మండలతో వేసిన మండపంలో కొలువుదీరనున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ సందర్భంగా వేయి కళ్ల దుత్తలతో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగింపుగా విరూప మండపానికి తీసుకెళ్లి ప్రతిమను ముక్కలు ముక్కలుగా చేయడంతో వెంకటగిరి జాతర ముగియనుంది. జాతర సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

నేపాల్‌లో చిక్కుకున్నారా!? అయితే, వివరాలు తెలపండి!

- క్యూఆర్ కోడ్ ద్వారా సహాయక చర్యలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని యుద్ధ ప్రాతిపదికన సురక్షితంగా తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతోందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక విమానాల ద్వారా తెలుగువారిని రాష్ట్రానికి సురక్షితంగా తీసుకురానున్నట్లు తెలిపారు. జిల్లావాసులు ఎవరైనా నేపాల్‌లో ఉంటే వారి వివరాలను క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకుంటే సహాయ సహకారాలు అందించేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

చిరుత కలకలం

కలువాయి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంట- కండాపురం మధ్యలో ఓ చిరుత సంచారం కలకలం రేపింది. స్థానికల కథనం మేరకు.. పర్లకొండ గ్రామానికి చెందిన పూలే పెంచలయ్య కలువాయిలోని ఎస్‌బీఐలో పని చేస్తున్నారు. కలువాయిలో విధులు ముగించుకుని మంగళవారం రాత్రి 9గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. తోపుగుంట- కండాపురం మధ్యలో పొదలకూరు- సోమశిల మెయిన్ రోడ్డును చిరుత దాటుతుండగా పెంచలయ్య గమనించాడు. అక్కడ నుంచి వేగంగా కండాపురం వద్దకు వెళ్లి అటువైపు వస్తున్నవారిని అప్రమత్తం చేశారు. ఈ విషయం బుధవారం స్థానికంగా కలకలం రేపింది.





కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

రేషన్ పంపిణీలో ఇక అక్రమాలకు చెక్!

- జిల్లాకు చేరిన కొత్త ఈ-పాస్ యంత్రాలు
- ఇప్పటికే నగరంలో పంపిణీ.. 15 నుంచి గ్రామాల్లో
- వినియోగంపై డీలర్లకు శిక్షణ



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బియ్యం, చక్కెర, కందిపప్పు వంటి నిత్యావసరాలు పక్కదారి పట్టకుండా క్యూర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోంది. అలాగే ఈ-పాస్ విధానం అమలులో ఉన్నా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఈ-పాస్ యంత్రాలలో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో డీలర్‌తోపాటు కార్డుదారులు అవస్థలు పడేవారు. వీటన్నిటికీ చెక్ పెట్టేందుకు అధునాతన సాంకేతికతో కూడిన ఈ-పాస్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. పాత యంత్రాలను వెనక్కి తీసుకుని ఈ నెల 15 నుంచి కొత్త యంత్రాలను డీలర్లకు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే...

నూతన యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కార్డుదారుని పూర్తి వివరాలు డిస్‌ప్లే అవుతాయి. కార్డుదారుకు ఏ ఏ సరు కులు అం దచేయాలో నమోదవుతుంది. వేలి ముద్రలు పడకపోతే ఐరిస్ ద్వారా స్కాన్ చేసేలా ఈ యంత్రాన్ని రూపొందించారు. కార్డు స్కాన్ అయిన తరువాత సరుకుల వివరాలతో కూడిన రశీదు వస్తుంది.

1513 రేషన్ షాపులకు..

జిల్లావ్యాప్తంగా 1513 రేషన్ షాపులు ఉండగా, వీటన్నిటికీ నూతన ఈ-పాస్ యంత్రాలను సరఫరా చేయనున్నారు. నెల్లూరు నగరంలో ఇప్పటికే పంపిణీ చేయగా, గ్రామీణ ప్రాంతాల్లోని డీలర్లకు 15 నుంచి అందజేయనున్నారు. ఈ యంత్రాన్ని ఎలా వినియోగించాలో డీలర్లకు శిక్షణ కూడా ఇస్తున్నారు.

15 నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దస్తావేజు రిజిస్ట్రేషన్ విధానంలో తీసుకొచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 15 నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఓటీపీ వల్ల పబ్లిక్ డేటా ఎంట్రీ చేసిన తరువాత ఏదైనా తప్పులు దొర్లితే సరిచేసుకొనే వెసులుబాటు సబ్ రిజిస్ట్రార్లకు ఉండేదని తెలిపారు. అయితే, ప్రస్తుత సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా ఆ వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. చిన్న తప్పు దొర్లినా మొత్తం వివరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఇంకా పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు

'సోమశిల'కు 18,506 క్యూసెక్కుల వరద

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 18,506 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. దీంతో డ్యాంలో 70.810 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,250 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఏపీ పీజీ సెట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

వెంకటాచలం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు వీఎస్‌యూలో అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను ఆ వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం హనుమారెడ్డి ప్రకటనలో తెలిపారు. కాకుటూరులోని వీఎస్‌యూ కళాశాలతోపాటు కావలిలోని పీజీ క్యాంపస్‌లో పీజీకి సంబంధించి వివిధ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్ విధానం కోసం విద్యార్థులు తప్పనిసరిగా ఏపీ పీజీ సెట్, వీఎస్‌యూ వెబ్‌సైట్‌లను సందర్శించాలని తెలిపారు.

త్వరలో రాష్ట్రానికి 1050 ఎలక్ట్రిక్ బస్సులు

- ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించండి
- ఉద్యోగులతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఉదయగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్రానికి 1,050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వా రకా తిరుమలరావు పేర్కొన్నారు. బుధవారం ఉదయగిరి డిపోను జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సంద ర్భంగా డిపో ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన విలేకరులతో ఎండీ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమలు తీరు ఎలా ఉంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎలాంటి చర్యలు చేపట్టాలి తదితర అంశాలపై డిపోలను సందర్శిస్తున్నట్లు చెప్పారు. ఆక్యుపెన్సీ పెరిగినా టిక్కెట్ రూపంలో సంస్థకు ఆదాయం రాదని, ప్రభుత్వమే సంస్థకు ఆదాయం సమకూరుస్తుందన్నారు. ఆర్టీసీ సిబ్బంది సైతం ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనుకున్న ప్రకారం కొత్త బస్సులన్నీ వస్తే రద్దీని తట్టుకోవడంతోపాటు పాత బస్సులను తొలగించడం జరుగు తున్నారు. అనంతరం డిపో ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేసి ఆదర్శ ఉద్యోగులకు ప్రశం సాపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ జోన్-3 నాగేంద్ర ప్రసాద్, ఈడీవో అప్పలరాజు, ఆర్ఎం షమీమ్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY, ANANTAPUR

SRI KALAHASTEESWARA INSTITUTE OF TECHNOLOGY

JNTUA- SKIT

A Co- education JNTUA Constituent College in SVU Region with self Financed Courses

Address: SKIT Road, PANAGAL, SRIKALAHASTHI, TIRUPATI DISTRICT

COURSES OFFERED

BRANCH	CODE	INTAKE
COMPUTER SCIENCE AND ENGINEERING	CSE	66
CSE (ARTIFICIAL INTELLIGENCE & MACHINE LEARNING)	CSM	66
CSE (DATA SCIENCE)	CSD	66
ELECTRONICS & COMMUNICATIONS ENGINEERING	ECE	66
ELECTRICAL & ELECTRONICS ENGINEERING	EEE	66

Full Fee Reimbursement

Tuition Fee 70,000/-

EAPCET CODE JNTSKSF

For Admissions Contact: 98480 16733

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262
కోడిగుడ్ల ధర (100)	550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.10437
వెండి కిలో ధర	రూ. 128800
వెండి ఒక గ్రాము	రూ.131.80

ఉచిత కంటి వైద్య శిబిరం

ఉలవపాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగొల్లులో బుధవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 54 మందికి వైద్యుడు కిరణ్ పరీక్షలు నిర్వహించి 26 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. మరో ఐదుగురికి కంటి అద్దాలు అందజేశారు. సింగరాయకొండ మండలంలోని పంటవారిపాలెం ఎల్వీప్రసాద్ బేస్‌మెంట్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో వైద్య శిబిరంకు సహకరించిన టీడీపీ నేత తమ్మినేని శ్రీనివాసుల నాయుడుకి నిర్వాహకులు ధన్యవా దాలు తెలిపారు.

న్యూస్ బాక్స్

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు మరమ్మతులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎక్స్‌కవేటర్‌తో సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

వలేటివారిపాలెం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : వలేటివారిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని పొలాల్లో దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు మరమ్మతులు చేశారు. ఆంధ్రజ్యోతిలో 'విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత' కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఏఈ మధుబాబు బుధవారం ఎక్స్ కవేటర్‌తో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయించారు. గత ఏడెనిమిది నెలలుగా పరిష్కారం కాని ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఆంధ్రజ్యోతి కథనంతో పరిష్కారం అయిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

● జడ్పీ సీఈవో మోహన రావు

కొండాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ లో నిర్లక్ష్యం తగదని జడ్పీ సీఈవో జే.మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుఎర్రబల్లిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చెత్త సేకరణ చేసి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి గ్రామాలను పరిశుభ్రం గా ఉంచాలని ఇవీ ఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలు వెంటనే పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సర్వేలు పూర్తయితేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వర్తిస్తాయన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఆయన రికార్డు లను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవో బి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న మినీ లారీ

మహిళ మృతి, ముగ్గురికి గాయాలు



మృతి చెందిన వాయిళ్ల మంగమ్మ

గుడ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆపి ఉన్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం మినిలారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆటోకు సైడు నిలబడి ఉన్న నలుగు రు కూలీలలో ఒక మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన గుడ్లూరు ఉప్పుటేరుకు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... బుధవారం ఉదయం కావలి మండలం తుమ్మలపెంటకు చెందిన వ్యవసాయ కూలీలు గుడ్లూరు మండలంలో కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి కావలికి ఆటోలో బయలుదేరారు. ఈ ఆటో గుడ్లూరు సమీపంలోని ఉప్పుటేరు దగ్గరకు రాగానే వర్షం అధికంగా పడడంతో రోడ్డుపక్కన ఆపి, పక్కనే ఉన్న చెట్టుకిందకు వెళ్లారు. అంతలో కందుకూరు వైపు నుంచి అతివేగంతో కావలికి వెళుతున్న డీసీఎం మినీ లారీ ఆగి ఉన్న ఆటోను వెనుకవైపు ఢీకొట్టడంతోపాటు, ఆటో పక్కన నిల్చొని ఉన్న నలుగురు కూలీలను కూ డా ఢీకొంది. దీంతో తుమ్మలపెం టకు చెందిన కూలీలు వాయిళ్ల మంగమ్మ (45) తీవ్ర గాయాలు కావడంతో కిఇత్స నిమిత్తం గుడ్లూరు ప్రభుత్వం వైద్యశాలకు 108లో తర లించారు. అయితే ఆమె మార్గమధ్యం లోనే మృతి చెందింది. మరో ముగ్గురు కూ లీలు పాలమ్మ, జాలమ్మ, లక్ష్మిల కు స్వల్ప గాయాలు తగల డంతో వారిని కందుకూరు ఏరియా వైద్య శాలకు తరలించారు. మంగమ్మ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరి యా వైద్యశాలకు తరలించినట్లు ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మినీలారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

● సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ

కొండాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు అందచేసిన విజ్ఞప్తులతోపాటు పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి సత్వరమే పరిష్కారం అందించాలన్నారు. అనంతరం సాయిపేటలో వివాదంలో ఉన్న వాటర్‌ప్లాంటు నిర్మాణాన్ని పరిశీలించి కోర్టు ఆదేశాల ప్రకారం ఎవ్వరికీ ఇబ్బందులు కలుగకుండా చూడాలని తహ సీల్దారు సురేష్‌బాబుకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ అనుదీప్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో సబ్‌కలెక్టర్ తనిఖీ



తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ

ఉలవపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ బుధవారం ఉలవపాడు తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా కార్యాలయం నిర్వహణ పనితీరుని పర్యేక్షించేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. మ్యుటేషన్లు, పాసుపుస్తకాల ఆన్‌లైన్, సకాలంలో అవస రమైన భూసర్వే, రికార్డుల నిర్వహణ తది తర అంశాలను పరిశీలించారు. మండలం లోని రెవెన్యూ సమస్యలపై తహసీల్దారు శ్రీనివాసులతో చర్చించారు. ఈ సందర్భగా కరేడు భూసేకరణ అంశంపై ఎంతమంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇండోసోల్‌కు ఇచ్చారు.. ఎంతమంది రైతులకు పరిహారం అందిందని సబ్ కలెక్టర్ హిమవంశీని ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా పూర్తి సమాచారం తీసుకుంటున్నామని, అందిన వెంటనే తెలియపరుస్తానన్నారు.



శ్రీనివాసులు హత్య గురించి బంధువులను విచారిస్తున్న కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

నిద్రిస్తున్న వ్యక్తి దారుణ హత్య

- మొగిలిచెర్లలో అర్ధరాత్రి ఘటన
- హంతకుల కోసం రెండు పోలీసు బృందాల ఏర్పాటు
- మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ బాలసుబ్రహ్మణ్య

లింగసముద్రం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలో తన ఇంటి వరండాలో నిద్రిస్తున్న ఓ వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల సమాచారం మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన ఆవుల శ్రీనివాసులు (45) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య వసంత నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశాడు. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన ఇంటి వరండాలో మంచంపై ఒంటరిగా నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు దేనితో కొట్టారో ఏమోగానీ తల వెనుక భాగంలో కణతపై బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం 6 గంటల సమయంలో ఆయన అల్లుడు రాజేంద్రప్రసాద్ అక్కడికి వచ్చి మామను లేపేందుకు ప్రయత్నించగా ఆయనకు రక్తగాయాలై కదలకపోవడంతో చనిపోయాడని భావించి బంధువులకు తెలిపాడు. దీంతో వారు పరిశీలించి పోలీసులకు సమాచారమిచ్చారు. గుడ్లూరు సీఐ జీ.మం గారావు, లింగస ముద్రం ఎస్ఐ ఎం.నారాయణలు మొగిలిచెర్లకు చేరుకుని సంఘటనా స్థలాన్ని, శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించారు. తలపై ఉన్న గాయాలను బట్టి శ్రీనివాసులును హత్య చేసి నట్టుగా నిర్ధారించారు. అలాగే శ్రీనివాసులు కుమార్తెలు మనీషా, మౌనీషాలు, బంధువుల నుంచి వివరాలు సేకరించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం నెల్లూరు నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బంది వచ్చి ఆధారాలు సేకరించారు.



మొగిలిచెర్లలో దుండగుల చేతిలో దారుణహత్యకు గురైన శ్రీనివాసులు

నిందితుల కోసం రెండు పోలీసు బృందాలు ఏర్పాటు : డీఎస్పీ

శ్రీనివాసులును హత్య చేసిన నిందితులను పట్టుకొనేందుకు లింగసముద్రం ఎస్ఐ నారాయణ, వలేటివారిపాలెం ఎస్ఐ మరిడినాయుడు ఆధ్వర్యంలో రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్టు కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీనివాసులు హత్య విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. సీఐ, ఎస్ఐలతో పాటు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులును ఎవరో దుండగులు కొట్టి చంపారని, నిందితులను త్వరలో పట్టుకుని కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పోస్‌మార్టం నిమిత్తం మృతదేహన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే ఎవరు హత్య చేశారు, ఎందుకు చేశారు అనే కారణం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అయితే హత్యకు వివాహేతర సంబంధమా? లేక ఇంకేదైనా కారణముందా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. శ్రీనివాసులు మృతితో కుమార్తెలు, బంధువులు బోరున విలపించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

యువకుడి ఆత్మహత్య

కందుకూరు(ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన టంకేశ్వర్(24) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను పట్టణంలోని విప్పగుంట రోడ్డులో ఓ రంపకోత మిల్లులో పనిచేస్తూ గత జనవరిలో ఒడిశాకు వెళ్లిపోయాడు. తిరిగి సోమవారం వచ్చాడు. ఈ క్రమంలో రూములోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పాల ఉత్పత్తుల తయారీతో మంచి లాభాలు



మహిళలకు పన్నీర్ తయారీపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త నిహారిక

కందుకూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు, పాడిరైతులు ముడిపాలను డెయిరీలకు విక్రయించటం కన్నా పాలతో విలువ ఆధారిత పదార్థాలు తయారీతో అధిక లాభాలు పొందవచ్చునని కందుకూరు సీటీఆర్ఐ- కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త బీ.నిహారిక తెలిపారు. మండలంలోని పలుకూరులో బుధవారం ఆమె స్వయం సహాయక సంఘాల మహిళలకు, పాడిరైతులకు పచ్చిపసుపు పన్నీర్, అశ్వగంథ పన్నీర్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా పన్నీర్ తయారుచేసి చూయించటంతో పాటు మార్కెట్లో పన్నీర్‌కున్న డిమాండ్ గురించి మహిళలకు వివరించారు. పాలను నేరుగా విక్రయించటం వల్ల పశుపోషకులకు శ్రమకు తగిన ఫలితం ఉండదని, అదే పాలతో పన్నీర్, పచ్చికోవా, పాలకోవా, కోవా కజ్జికాయలు లాంటి ఉత్పత్తుల తయారీతో రెట్టింపు లాభాలు వస్తాయని తెలిపారు. ముఖ్యంగా పన్నీర్ తయారీతో మంచి ఫలితం ఉంటుందని, కేవలం చిన్నపాత్రలు, తక్కువ పెట్టుబడితో సులభంగా తయారు చేసి విక్రయించుకోవచ్చునని సూచించారు. పన్నీర్ తయారీలో పసుపు, అశ్వగంధను కూడా మిళితం చేయవచ్చునని, వీటిలో అధిక పోషక విలువలు, ఔషధగుణాలు ఉన్నందున డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. వివిధ రకాల పన్నీర్ తయారీ విధానాలను ఆమె స్వయంగా చేసి, వారితో చేయించి అవగాహన కల్పించారు.

పాఠశాలల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

సీతారామపురం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు, గణిత సామర్థ్యాలలో విద్యార్థులు రాణించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. మండల పరిధిలోని నెమళ్లదిన్నె, గంగవరం ప్రాథమిక పాఠశాలలను బుధవారం తనిఖీ చేసి విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. తెలుగు గుణింతాలు సులభంగా పిల్లలకు ఎలా నేర్పించాలో తెలియజేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పామనబోయిన బాలకృష్ణ, జన్యాల వెంకటేశ్వర్లు, సీఆర్‌పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

కలువాయి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివసాయి కళాశాలలో బుధవారం గ్యాస్ వినియోగంపై స్థానిక ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎస్ఐ మార్కు కల్గిన పైపులు, స్టవ్, రెగ్యులేటర్ మాత్రమే వాడాలని, గ్యాస్ సిలిండర్ ఇంటికి డెలివరీ సమయంలో సీల్ ఉందా లేదా అని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మేనేజర్లు ఎస్‌కే షాహులు, నరసింహ, శివ, ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉమర్‌బాబు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడంతో బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

సంగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న శైలజ, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్‌కు ఇటీవల ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. దీంతో బుధవారం కార్యాలయ సిబ్బంది వారిరువురిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వెంగారెడ్డిపాళెం సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బందితోపాటు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌గా 'గని' ప్రమాణ స్వీకారం

వింజమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సంఘం సొసైటీ డైరెక్టర్‌గా గని శ్రీనివాసనాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతతో విధులు నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, సీఈవో మేకల రమణయ్య, నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వినియోగం అనర్థదాయకం



తరుణవాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

సంగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోతా దుకు మించి యూరియా వాడితే అనార్థమేనని వ్యవసాయాధికారి శశిధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని చెన్నవరపాడు, తరుణ వాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగం గా మోతాదుకు మించి యూరియా వాడితే జరిగే నష్టాలు, అనార్థాలను రైతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన రైతు సేవా కేంద్రాల్లో రైతులతో మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు, పొలం దెబ్బతింటుదన్నారు. నేల సారాన్ని దెబ్బతీస్తుందన్నారు. మొక్కలు విరివిగా పెరిగి చీడపీడలు ఆశించే అవకాశం ఎక్కువని, భూగర్భ జలాలు కాలుష్యం జరిగి ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. జీవన ఎరువులు వినియోగించుకోవాలని, అధిక యూరియా వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** రైతులు పంటలకు అధికంగా యూరియాను వినియోగించడం అనర్థదాయకమని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం, జీ.చెరువుపల్లి గ్రామాల్లో రైతులకు యూరియా వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టి వ్యవసాయాధికారుల సిఫార్సు మేరకే పంటలకు ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** మండలంలోని కొత్తపేట, తెడ్డుపాడు రైతుసేవా కేంద్రాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్ అధిక ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చంద్రశేఖర్, రోషిణి, రైతులు తదితరులు పాలొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలిస్తే కేసులు



దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఆత్మకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మ కాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో బుధ వారం పట్టణం లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆత్మకూరులోని పలు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కె వేణుగోపాల్, విజిలెన్స్ సీఐ షేక్ సుభాని, వ్యవసాయాధికారి కిషోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారులకు ఆర్థిక సాయం పెంచాలి



గాయపడిన చిన్నారులను పరామర్శిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఐక్యవేదిక నాయకులు

ఉదయగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలి తీవ్రంగా గాయపడ్డ చిన్నారులకు ప్రభుత్వం ఆర్థికసాయం పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జనరల్ కార్యదర్శి ఆర్ వెంకటజ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితారాంయాదవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజగోపాల్, శ్రీనివాసుల యాదవ్‌లతోపాటు పలువురు నాయకులు అప్పసముద్రం గ్రామానికి చేరుకుని బాణసంచా పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలై ఇంటికి చేరుకున్న చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఒక్కో చిన్నారికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాగౌడ సంఘం నాయకులు రాముగౌడ్, గోపాల్, జనసేన జిల్లా నాయకులు పవన్‌కుమార్‌యాదవ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సర్పంచు దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రధాన వీధిలోని మురుగు కాలువలో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని ఆయనే స్వయంగా తొలగించడంతో పాటు కార్మికుల ద్వారా శుభ్రం చేయించారు. అలాగే బస్టాండ్ సెంటర్‌లోని విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా అల్లుకుపోయిన కంపచెట్లను సైతం తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు వెంటనే తన దృష్టికి తీసుకొస్తే పంచాయతీ కార్యదర్శి సహకారంతో పరిష్కరించడం జరుగుతుందని హామినిచ్చారు.

జాబ్ మేళాకు మంచి స్పందన

ఆత్మకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ బియస్ఆర్ ఐటీఐ యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఉదయం 9 గంటల నుంచి 2గంటల వరకు జరిగిన ఈ జాబ్ మేళాకు పలు పేరుగాంచిన ఎంఎన్‌సీ, గ్రీన్‌టెక్, బ్లూస్టార్, టీవీఎస్ గ్రూప్, ఎలక్ట్రోస్టీల్, గోల్డ్ ఫీల్డ్, యమహా, మారుతీ సుజికి, కిసాన్ క్రాఫ్ట్, డ్రోన్ టెక్నాలజీ తదితర సంస్థలు రాగా సుమారు 52 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఎంపికైన వారికి రెండు రోజుల్లో కాల్ లెటర్లు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రకాష్ బీగాల, సంగం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ మురళీ, కంపెనీల ప్రతినిధులు, ఐటీఐ కళాశాల సిబ్బంది నాపా సుధీర్, కృష్ణయ్య, బాదుల్లా, సుష్మీన్, శోభా తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 636 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 408 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 228 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 320 కాగా, కనిష్ఠ ధర రూ. 110 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

వింజమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరులో ఉన్న ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె ఖాదర్‌బాషాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పి కొండారెడ్డి, జె వెంకటేశ్వర్లు, ఏ చంద్రన్, విద్యార్థులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఖాదర్‌బాషా సేవలను కొనియాడారు.

చాకలి ఐలమ్మకు నివాళి



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి కోసం సాయుధ పోరాటాలు సాగించిన చాకలి ఐలమ్మ సేవలు ఎనలేనివని మండల రజక సంఘం అధ్యక్షుడు మాచర్ల గురవయ్య అన్నారు. బుధవారం బస్టాండ్ సెంటర్‌లో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యాదగిరి హజరత్, ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటే శ్వర్లు, కోశాధికారి యాదగిరి ప్రసాద్, కార్యదర్శి యాదగిరి తిరుపాలు, సభ్యులు పాల్గొన్నారు.

నగదు అపహరణ

సీతారామపురం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ చేతిలో నగదు అపహరించి గుర్తుతెలియని వ్యక్తి పరారైన ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. స్థానిక కెనరా బ్యాంక్‌లో సంగసానిపల్లి గ్రామానికి చెందిన నిలి విజయమ్మ రూ. 13వేలు నగదు విత్‌డ్రా చేసుకుని బయటకు వచ్చి లెక్క చూసుకుంటుండగా గుర్తుతెలియని దుండగుడు ఆమె చేతిలోని నగదు అపహరించి బైక్‌పై పరారయ్యాడు. విజయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శివకృష్ణరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నిబంధనలు పాటించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈవో-2 టీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఆయన సందర్శించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

డాక్యుమెంట్ మిస్సింగ్
వేముల చెన్నకేశవుల నాయుడు S/o సుబ్రహ్మణ్యం, కావలి బిట్ 1, కావలి, SPSR నెల్లూరు జిల్లా కు చెందిన నేను తేది:08-07-2025న నాకు సంబంధించిన స్థలం యొక్క ఒరిజినల్ టైటిల్ డీడ్ No.5730/2025 గల డాక్యుమెంట్ బ్యాగ్ ను కావలి లోని మా ఇంటి వద్ద నుంచి తీసుకెళుతుండగా దారిలో కూరగాయల మార్కెట్ వద్ద పోగొట్టుకున్నాను. కావున ఎవరికైనను దొరికిన యెడల తెలియచేయగలరు...
వేముల చెన్నకేశవుల నాయుడు
Cell : 9632595999